గోతెలుగు.కామ్

చక్కటి కుటుంబ వార పత్రిక

# మార్చి 2016
# కథలు




"మా తల్లే .. ఎంత వినయం, ఎంత వందనం? ఈ కాలం పిల్లల్లా లేవమ్మా" అంటూ లేవదీసి అక్కున చేర్చుకుంది, కాబోయే అత్తగారు.

"అమ్మా, నేనొకసారి... మాట్లాడుతా." మెల్లిగా గొణిగాడు పెళ్ళికొడుకు,, ఇంటి దగ్గర ఇచ్చిన వార్నింగ్ మర్చిపోయి.

" ఆ మూడుముళ్ళు పడిపోతే , ఇంక అన్నీ మాటలే అంత తొందరెందుకూ?" అంటూ కళ్ళతోనే హెచ్చరించింది.

బుద్ధిగా తలూపి .. అమ్మాయికేసి ఒక మారు చూసి బయటకు నడిచాడు. ఆ చూపులో "వెళ్ళొస్తా" అన్న మాటలతో బాటు తానంటే ప్రేమ కనబడి 'ఫ్లాట్' అయిపోయింది జాను. అబ్బాయి చూపు... అందమైన ఆ విగ్రహం గుర్తుకు వచ్చి మారు మాట్లాడకుండా ఒప్పేసుకుంది జాహ్నవి, అదే అసలు ట్విస్ట్, జాహ్నవికి వంటే రాదు సరి కదా 'వంకాయా అంటేనే ఇష్టం వుండదు మరి.

"అంతా బానే వుంది కానీ.. ఏదో కొంచెం తేడాగా వున్నట్లు లేదూ?" సందేహం వెలిబుచ్చాడు జాహ్నవి తండ్రి.'శన్క' ర్రావు.

"మీకన్నీ అనుమానాలే.. అందరూ మీలా ధుమ ధుమలాడుతూ వుండాలా ఏం? నా తల్లి బంగారు పూలతో పూజ చేసింది కనుకే బంగారంలాంటి సంబంధం ... వెతుక్కుంటూ వచ్చింది. పిల్లాడు ఆరడుగుల అందగాడు, మంచి చదువూ, ఆరంకెల జీతం, ఒక్కడే కొడుకు, బాగా వున్న వాళ్ళు. పిచ్చిపిచ్చి శంకకలేం పెట్టుకోక ... మంచిరోజు చూసుకు వాళ్ళింటికెళ్ళి ముహూర్తం పెట్టించేసెయ్యండి... " ఆనందంగా అంది.

ముప్పై పెళ్ళి చూపుల అనుభవంతో ఆ ముప్పై ఏళ్ళ పెళ్ళికొడుకు జాహ్నవి పాలపడ్డాడు. మొత్తానికి ఆ రకంగా పెళ్ళిచూపుల ప్రహసనం నడిచి .. గున్నేశ్వర్రావు... జాహ్నవి ఆలూమగలయ్యారు.

జాహ్నవికి ఓ పక్క బెదురుగానే వుంది.. పెళ్ళిచూపుల్లో 'అత్తగారూ తనకు చెప్పిన విషయాలు గుర్తొచ్చి.

"వాడికి రోజూ వంకాయ కూర లేనిదే ముద్ద దిగదు. చిన్నప్పటినుంచి అదే అలవాటు అయిపోయింది. ఐ.ఐ.టి లో చేరిస్తే , అక్కడ వుండలేక, వంకాయ కూర లేని ఆ తిండి తినలేక... సగం లో వదిలేసి పారిపోయి వచ్చేస్తే, చదువు పాడవటం ఇష్టం లేక వాళ్ళ నాన్న, వాడికి వండి పెట్టడం కోసం నన్ను అక్కడికి పంపి పాపం ఆ నాలుగు ఏళ్ళు తను తంటాలు పడ్డారు ఒంటరిగా." కొంచెం మురిపెంగాను.. కొంచెం కోపంగాను చెప్పిన ఆ మాటలు అంత ఆనందంలోనూ కలవరపెట్టాయామెను.

"పెళ్ళిలో.. మూడు పూటలా వంకాయ కూర మెయిన్ మెనూ.. వాళ్ళు కోరిన విధంగా ఝూం ఝూమ్మని పెళ్ళి చేసాడు, శంకర్రావు.

పెళ్ళిలో అలకపానుపుపు మీద పెళ్ళికొడుకు అడిగిన కోరిన విని పెళ్ళికొచ్చిన వాళ్ళంతా ఒకటే నవ్వులు, ఇంతకీ ఏమడిగాడు అనుకున్నారు? పెళ్ళి కూతురు స్వహస్తాలతో చేసిన వంకాయ మెంతి కారం కూర, అందరి నవ్వుల మధ్యా వేళా కోళాల మధ్యా ' ఆ కూర వచ్చింది.. అచ్చం తన తల్లి చేసినట్లే వుంది అంటూ తెగ ఆనందపడిపోయాడు మానవుడు, అది తన తల్లే చేసిందని తెలియక.. ఏమైనా కోనసీమ పిల్ల కోనసీమ పిల్లే. అందుకే తను పట్టుబట్టి కోనసీమ సంబంధమే చేసుకున్నానంటూ తెగ మురిసిపోయాడు.

పాల గ్లాసుతో గదిలోకి వచ్చిన జాహ్నవిని చూసి ఎంతో ఆనందంగా, మరెంతో ఇష్టంగా దగ్గరకు తీసుకు తియ్యటి ముద్దిచ్చి... ఆ మైమరుపులో జాహ్నవి వుండగానే "బాగుంది కదూ.. లేత 'గుత్తొంకాయ్' కూరలా" పరవశంగా అన్నాడు, గున్నేశ్వరరావు.

అదిరిపడి బయటకొచ్చింది ఆ మైమరుపులోంచి.. వింతగా చూసింది. పుస్తకాల్లో, సినిమాల్లో తొలి ముద్దుని, ప్రేయసి అధరాలని 'మధువు తోనో.. మరింత మధురమైన ద్రాక్షాలతోనో పోల్చడం చూసింది కానీ 'లేత గుత్తొంకాయ కూరతో..'

ఎలాగయినా అతనిలో ఆ పిచ్చి.. తగ్గించి మామూలు మనిషిని చెయ్యాలని ఆ క్షణమే కంకణం కట్టుకుంది. మూడు రాత్రులు, మనుగడుపులూ.. అంటూ పెళ్ళి వేడుకలన్నీ పూర్తయి అత్తవారింటికి .. బయలుదేరే కూతురికి హితవు చెబుతూ అరుంధతి, "తల్లీ, భర్త ప్రేమా, దాంపత్య జీవితం లోని మధురిమా అన్నీ తొలినాళ్ళ మీదనే ఆధారపడి వుంటాయ్.. మగవాడి కడుపు.."

"అమ్మా..."కంగారుగా వారించింది, జాహ్నవి.

"చ చెప్పనీ.. అన్నిటికీ తొందరే...' ఆ కడుపు 'కాదు... మగవాడి రుచి తెల్సుకు రుచికరంగా కడుపునిండా పెట్టే భార్యని ఏ మగాడయినా , చచ్చినట్లు ప్రేమించి తీరుతాడు. అబ్బాయికి వంకాయ కూరంటే పిచ్చి అట.. ఆ కారణంగానే అన్ని సంబంధాలు తప్పిపోయాయట.. నీకేమో వంకాయ పొడే గిట్టదు అందుకే నీకు చెప్పలేదు.. ఏదో ఒక ఇష్టం, వ్యసనం లేని మనిషి వుండడు. ఇదేమి.. దుర్వ్యసనం కాదు.. ప్రాణాంతకం కాదు.. పాపం మీ అత్తగారి దగ్గర ఎలా చెయ్యాలో నేర్చుకు రోజూ చేసిపెట్టు" అంటూ ఉపదేశించిన తల్లిని.. విలన్ని చూసినట్లు చూసింది, ఇంత కుట్రా? అనుకుంటూ.

మనుగుడుపులూ, మూడు నిద్దర్లూ అయి.. పెళ్ళి సందడి అంతా ముగిసి పిల్లని అత్తారింటికి తీసుకొచ్చాకా, "జానూ.. ఏది, నీ అందమైన చేతులతో ఇంకా అందమైన కూర అదే 'గుత్తి వంకాయా కూరోయ్ బావా వలపంత కూరి వండినానోయ్ బావా' అంటూ చేసి పెట్టవా ప్లీజ్" అన్న మొగుడిని వింతగా అయోమయంగా చూసింది జాహ్నవి.

"ఒరేయ్ ..ఇంక జీవితాంతం, దాని చేతి వంటే తింటావ్ గానీ కొత్త పెళ్ళి కూతురు.. ఇప్పుడు.. దానికి అలాంటి పనులేం చెప్పకు కోప్పడింది అదివిన్న తల్లి.

"అంటే .. కాస్త నీ దగ్గర ట్రైఇనింగ్ అవుతుందని...."నీళ్ళు నమిలేడు. ఎలాగో తంటాలు పడి నేర్చుకు భర్తని ఆనందింప చేద్దామని నా నా కష్టాలు పడి నేర్చుకుంది అత్తగారి దగ్గర, పదహారురోజుల పండుగ తర్వాత అత్తగారు గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది.. కోడలి 'వంటింటి ప్రవేశానికి.

మొదటి రోజు " ఇది నేనే చేశా రుచి చూసి చెప్పండి ఎలా వుందో?" అంటూ కంచం లో వడ్డించిన పదార్ధం ఏమిటో అర్ధం కాకపోయినా కొత్త పెళ్ళాన్ని చిన్న బుచ్చడం ఇష్టంలేక ఏమిటి? అని అడక్కుండా నోట్లో పెట్టుకున్నాడు భయం భయం గా. అంతే... ఆవిడ కొంచెం పక్కకి వెళ్ళగా చూసి.

"ఆ..ఆ.. అర్జెంటుగా రావాలా? ఇదిగో ఇప్పుడే వస్తున్నా" అంటూ మోగని సెల్ లో మాట్లాడి గబ గబా కంచం ముందు నుండి లేచిపోయాడు.

"సారీ రా జానూ.. అర్జెంటుగా ఆఫీస్ కి వెళ్ళాలి.. నా కోసం కూర్చోక నువ్వు తినేసేయ్" అంటూ వెళ్ళిపోయిన మొగుడిని.. చూసి అయ్యో ఇంకొంచెం ముందు పెట్టవలసినది.. పాపం తినకుండా వెళ్ళిపోయాడు అని బాధపడుతున్న కోడలికి..."వాడు నువ్వు చేసిన కూర తినలేకే వెళ్ళిపోయాడూ అని చెప్పలేక 'పిల్లాడు తినకుండా వెళ్ళిపోయాడే' అని బాధపడుతూ అప్పటికప్పుడు మళ్ళీ కూర చేసింది అతని కోసం.

ఎలాగైనా ఈ పిల్లకి ఈ కూర చెయ్యడం నేర్పాలి అనుకుంటూ.

పెళ్ళయిన వేళా విశేషం .. ఇంకా పెద్ద జీతంతో 'ఏడాదీ పాటు అమెరికా, ప్రాజెక్ట్ పని మీద భార్యా భర్తలిద్దరినీ పంపుతామన్నారు కంపెనీ వాళ్ళు, జాహ్నవి, అత్తగారు ఇద్దరి గుండెల్లో రైళ్ళు పరిగెట్టాయి..బెంగుళూరు వాళ్ళతో బ్బాటు వెళ్ళి కొన్నాళ్ళు దగ్గరుండి కోడలికి 'గుత్తొంకాయా కూర అన్ని రకాలు చెయ్యడం ఎలాగో నేర్పించి వచ్చేయొచ్చులే అని తలచిన ఆ తల్లికి ఇప్పుడేం చేయ్యాలో అర్థం కాలేదు, అయినా కొత్త పెళ్ళాం.. కొత్త కాపురం వాడే సర్దుకుంటాడులే అని సరిపుచ్చుకుని.. మెంతి కారం, ధనియాల కారం పొడులు చేసి కోడలికి అవి ఎలా చెయ్యాలో చెప్పి... డౌట్ వస్తే ఫోన్ చేయమని ధైర్యం చెప్పి విమానం ఎక్కించింది.

కంపెనీ వాళ్ళు ఇచ్చిన చక్కని అందమైన బంగ్లా ముందర లాన్ లో సహా కారు, ఖరీదైన ఫర్నీచర్, అంతకంటే కొత్త పెళ్ళాం.. ఓహ్ చెప్పాలా అమెరికా అంటే భూతల స్వర్గమే.

అక్కడ కాస్త సర్దుకుంటూనే.. వాల్మార్ట్ కి వెళ్ళి 'నవనవ లాడే గుత్తొంకాయలు తెచ్చిన మొగుడిని చూస్తూనే కంగారు పుట్టింది జాహ్నవికి. "జానూ డియర్ చూడు ఇవి ఎంత ముద్దుగా.. ఫ్రెష్ గా నోరూరించేలా వున్నాయో, గుత్తొంకాయలతో ఎన్ని రకాలు చేయవచ్చనుకున్నావ్, మెంతి కారం, ధనియాల కారం, కొత్తిమీర కారం, ఉల్లి కారం.. అంటూ అర్ధ నిమీలిత నేత్రాలతో ఆ రుచులను, పలకడంల్లోనే ఆస్వాదిస్తూ అదేదో సినిమాలో సుత్తి వీరబద్ర రావు స్టైల్లో చెబుతున్న మొగుడిని చూసి మంటెక్కిపోయింది జాహ్నవికి. " నా దిబ్బ కారం, నా దిరుగుండం కారం అన్ని రకాల కారాలు బానే తెలుసు ఒక్క పెళ్ళాం మీద 'మమకారం' తప్ప అనుకుంది మంటగా..

దేముడి మీద భారం వేసి, తననలా ఇరికించిన అత్తగారిని తిట్టుకుంటూ వంకాయలు అత్తగారు ఎలా కడిగారో, ఎలా తరిగారు గుర్తుచేసుకుంటూ తరిగింది, విపరీతమైన టెన్షన్ పడుతూ వండింది. ప్చ్, మన వీర వంకాయ ప్రేమికుడికి అసలు అది వంకాయ కూరలా అనిపిస్తేనా?

మొదట్లో విసుగ్గా, అయిష్టం గా చేసినా రాను రానూ ఎలాగైనా బాగా చేసి ప్రియమైన మొగుడు గారితో 'శభాష్' అనిపించుకోవాలనే పేరాశతో, రెట్టించిన ఉత్సాహంతో వంకాయని రకరకాల ప్రయోగాలతో చిత్ర హింసలుసలు పెడుతున్న జాహ్నవిని వారించి, వారించి నివారించలేక హుతాశుడయ్యాడు.

అమెరికా అంటే భూతల స్వర్గం ఎవరికైనా కానీ మనవాడికి మాత్రం కాదు.. కారణం తనకెంతో ఇష్టమైన, ప్రాణప్రదమైన 'గుత్తొంకాయ్ కూరే' ఓహ్ అమెరికా అంటే భూతల స్వర్గం అన్నది నిజమే కదా.. అని మురిసేటంతలో ... కంచం లో భూతం లా భయపడుతోంది... రోజుకో రకంగా. తనకోసం ఎంతో శ్రమపడి.. వాల్మార్ట్ కి వెళ్ళి, వంకాయలు, తెచ్చి అష్ట కష్టాలు పడి...ఏవో కాగితాలు, పుస్తకాలు చదివి అదీ సరిపోక నెట్ బ్రౌజ్ చేసి , తల్లితో లైఫ్ లైన్ తీసుకు రకరకాలుగా తనకోసం శ్రమ పడుతున్న ఇల్లాలిని నొప్పించలేక.. అలా అని కూర అనబడే ఆ ముద్దని మింగలేక .. కక్కలేక సతమతమైపోయాడు.

"అది కాదురా పోనీ కొన్నాళ్ళు ఈ కూర వదిలేద్దాం" అనునయన్ గా అన్నాడు"

"నా వంట అంత బాగా లేదా? పాపిష్టిదాన్ని మీకు కడుపునిండా మీ కిష్టమైన కూర కూడా చేసి పెట్టలేక పోతున్నా" అంటూ కళ్ళ నీళ్ళు పెట్టుకున్న భార్యని చూసి తల్లడిల్లిపోయాడు.

"చూడు.. వంకాయల్ని ఇలా ముద్ద ముద్దల్లా కాదు చక్కగా కాయ కాయల్లా వుండాలి...' అంటూ చిన్న హింట్ ఇచ్చాడు. మర్నాడు దేముడి మీద భారం వేసి , కాయలు తరిగి మైక్రో ఓవెన్ లో పెట్టి.. తరువాత వాటిని బయటకు తీసి.. విడిపోతుంటే ఏం చెయ్యాలా అని ఆలోచించి.. ఆలోచించి.. చక్కగా అవి విడిపోకుండా దారం కట్టింది. అమ్మ ఇచ్చిన కారం ఘుమ ఘుమ లాడుతూ, చక్కగా నోనూడుతూ నోరూరించగా గబ గబా వచ్చేశాడు భోజనానికి, బుజ్జి ముండలు ముద్దొస్తూ బుజ్జి బుజ్జి వంకాయలు కంచం లో దర్శనమిచ్చాయి, కొంచెం ఆశ కలిగింది బాగా కుదిరిందని ఉత్సాహంగా కంచం ముందు చేరి.. భార్యతో..

"వహ్..జాను..కూర ఘుమ ఘుమ.. అంటూ .. "కూర నోట్లో పెట్టిన గున్నేశ్వర్రావు అడుగడుగునా దారాలు తగలడంతో హతాశుడయ్యాడు.. కోపంగా ఉరిమి చూస్తున్న భర్తకి.. కాయలు విడిపోకుండా దారం కట్టిన వైనం భయం భయం గా చెప్పింది.

ఈ వెధవ కూర తమ ఇద్దరి మధ్యా .. ఇనుప గోడలా తయారయ్యింది.. పాపం తననేం అనడంలేదు కాని సర్వస్వం కోల్పోయిన వాడిలా.. అలా వుంటే తనకు మాత్రం ఏం బాగుంటుంది?ఇపైగా అత్తగారు ఒకటే బాధపడిపోతూ రోజూ క్లాసులే, అంత చదువు చదివిన దానివి.. ఈ మాత్రం చేత కాదా?... నీ కిష్టం లేదు కనుక చెయ్యడం లేదు ' అంటూ ఆలోచనల్లోంచి బయటకొచ్చింది భర్త వెర్రి కేకతో.. ఆశగా నోట్లో పెట్టుకున్న వంకాయ బయటకు వేలాడుతోంది.. ఉరి వేయబడ్డ దానిలా, పళ్ళ మధ్య ఇరుక్కుపోయిన దారం గట్టిగా లాగడంతో నాలిక తెగి గాయం అయి అంత గావు కేక పెట్టించింది.

"అయ్యయ్యో అంటూ గబ గబా చిన్న కత్తెరతో ఆ దారం కత్తిరించేసింది.. ఆ దారపు ఆధారం కోల్పోయిన ఆ వంకాయ ఉరి నుంచి జారి కిందపడిన పార్థివ దేహం లా అమాయకంగా 'ఠప్పునా జారిపడింది.

నాలిక తెగి రక్తం ఓడుతుండగా, లబ లబలాడుతూ చన్నీళ్ళతో నోరు కడుక్కుంటున్న భర్తని జాలిగా , నీళ్ళు నిండిన ఇంతలేసి కళ్ళతో.. భయం భయం గా చూస్తూ వుండిపోయింది.

కాస్త నెమ్మదించాకా.. బెదురు బెదురుగా దగ్గరకొచ్చిన భార్యని ప్రేమగా దగ్గరకు తీసుకుని ..

"అది కాదురా జానూ.. చిన్నప్పటి నుండి తిని తిని బాగా బోర్ కొడుతోంది కాని నువు ఇంక వంకాయ్ వండటం మానేసి ఇంకేదయినా ట్రై చేయి " అనునయన్ గా చెప్పాడు నోరు మండుతున్నా.

"అది కాదండీ.. రోజూ షేప్ లేకుండా ముద్ద ముద్దగా అయిపోయి కాయలన్నీ విడిపోతున్నాయి కదాని, వంకాయలో కారం కూరాకా.. కాయ చొట్టూ దారం చుట్టా విడిపోకుండా.. తింటుంటే దారం తీసేయొచ్చు కదాని ఇలా అవుతుందనుకోలేదు, సారీ అండి.. నా వల్లనే మీకు ..." అంటూ గొల్లుమంది.

"పోనీ , సెల్ టేప్ వేసి వుండాల్సింది..." ఓదారుస్తూనే మంటగా "నిజమేనండోయ్... ఆ ఆలోచన రాలేదు సుమీ, రేపు అలా చేస్తా, అదయితే ఇలా తెగే ప్రమాదం వుండదు..." కళ్ళు తుడుచుకుంటూ ఉత్సాహంగా అన్నది.

"నా తల్లో.. ఏదో రకంగా నన్ను హింసించడానికే కంకణం కట్టుకున్నావా? ... దేముడా.. ఎందుకిలా నా మీద పగబట్టావ్?" అనుకుంటూ శతవిధాల ప్రయత్నించాడు. శ్రీమతి ఇలా వంకాయా కూరతో దాడి చెయ్యకుండ, అబ్బే .. వింటేనా? రోజురోజుకీ ఆ చిత్ర హింస భరించలేక, తట్టుకోలేక.. 'వంకాయా అన్న మాట వినబడితే కాదు కలలో కొచ్చినా అదిరిపోసాగాడు.

ఎలాగో నాలుగు నెలలు గడిచాయి.. ఉగ్రవాదం కన్నా టెర్రర్ లా మారింది అతనిలో ఈ భయం. అప్పుడొచ్చింది అతనికి మెరుపులాంటి ఐడియా, వెంటనే బాసుని బతిమాలి వారం రోజులు సెలవు తీసుకుని భార్యా సమేతుడై ఇండియా వచ్చాడు, ఇంటికి కాదు..."కాశికి" అక్కడికి వచ్చిన వాళ్ళు తమకిష్టమైన దాన్ని వదిలేస్తారుగా.. అందుకు.

వేరే చెప్పాలా పాపం పూర్ గున్నేశ్వర్రావు... కాశీలో తనకిష్టమైన.. "వంకాయ్" వదిలేసాడనీ... ఆ విధంగా తన "చిత్ర హింసల " ప్రహసనాన్ని తప్పించుకున్నాడనీ మొత్తానికి ఆ విధంగా తన మొగుడి 'వంకాయ కూరా అనే 'పిచ్చి పిచ్చి వంటా అనే ప్రయోగాలతో వదిలించిన జాహ్నవి ఒకింత జాలి గానూ, మరింత ఆనందం గానూ నిట్టూర్చింది. "హమ్మయ్య" అనుకుంటూ




విఘ్నేశ్వరుడి గుడి దాటి మా ఇంటి సందు లోకి కారు తిరుగు తుండగా ' సెల్' రింగ్ అయింది. మా ఆవిడ సుందరి ఫోను. " ఎక్కడున్నారు? మీ పెద్దన్నయ్య గారు రెండు మాట్లు ఫోన్ చేసారు. కృష్ణ నెంబర్ కి చేయమన్నారు" అని కట్ చేసింది. పెద్దన్నయ్య రిటైరయింతరువాత విజయవాడ లోనే సెటిల్ అయినా కొంత కాలం కొడుకు కృష్ణ దగ్గర అస్సాం లోనూ, ఇంకొంతకాలం కూతురు సంధ్య తో మదురై లోనూ గడుపు తూ ఉంటాడు. ఎక్కడికి వెళ్ళినా 'అమ్మని నాదగ్గర వదిలి వెళుతూ ఉంటాడు. మిగతా ఇద్దరు అన్నయ్యలు ఉన్నా అమ్మ ఎప్పుడూ పెద్దన్నయ్య దగ్గర కాని , నా దగ్గర కాని ఉండడం అలవాటు. . లోపలి కి వెళ్లి చేయచ్చులే అనుకుని కుమార్ కి మర్నాడు ఎప్పుడు రావాలో చెప్పి లోపలికి నడిచాను.

ఫోన్ చేయగానే పెద్దన్నయ్య " ఏమిలేదురా తాత గారి ఊరు వెళ్లి చిన్నమామయ్యని కలవాలి. అమ్మ భూమి మీద వచ్చే శిస్తు తీసుకు రావాలి. నీకు తెలుసుగా ఏడాదికి ఒక మాటైనా మనం రావాలనుకుంటాడు. శిస్తు వేరే విధంగా పంపడం అతనికి ఇష్టం ఉండదు. వచ్చే బుధవారం ప్రతి ఏడాది చేసే కామేశ్వరి వ్రతం చేస్తున్నాడు. ఆ వేళకి వెడితే బాగుంటుంది" అని పెట్టేసాడు

మా తాత గారి ఊరు కృష్ణా జిల్లా లో దివి సీమ లో ఓ పల్లెటూరు. మాది పగో జిల్లా భీమవరం దగ్గర వీరవాసరం మాకు

దగ్గర యూనివెర్సిటీ అయిన ఆంధ్ర యూనివెర్సిటీ అప్పట్లో గుంటూరు లో ఉన్నప్పుడు నాన్న గారు పిజి అక్కడ చేసారు. మా పెద్ద మామయ్యా ఆయన అక్కడ క్లాస్ మేట్స్ .వాళ్ళ స్నేహాన్ని బంధుత్వం గా మార్చాలని పెద్దమావయ్య పూనుకోవడం వల్ల, మా అమ్మని నాన్న గారు చేసుకోవడం జరిగింది. పెద్దమావయ్య వాళ్ళు నలుగురు. మిగతా ముగ్గురు బయట ఉద్యోగాలికి వెళ్ళిపోతే చిన్న మావయ్య మాత్రం అక్కడే ఉండి భూములు చూసుకుంటున్నాడు. కొబ్బరి తోటలు, ఊడుపు చేలు చాలానే ఉన్నాయ్. నాలుంగు వందల గడప ఉన్న ఊళ్ళో మూడు నాలుగు పెద్ద కుటుంబాల్లో తాత గారిది ఒకటి. తాత గారు అమ్మకి ప్రత్యేకంగా కొంత పొలం ఇచ్చారు. దాని శిస్తు చాల శ్రద్ధగా మా మావయ్యలు మా అమ్మకి ఇవ్వటం జరుగుతోంది.మా కుటుంబాల్లో ఓ గట్టి నమ్మకం ఏమిటంటే ఆడపిల్లల సొమ్ము మనకి కలవకూడదు. అలా జరగడం మనకి మంచిదికాదు అని . మా నాన్న గారు అమ్మ భూమి మీద వచ్చే దాన్ని వేరే ఎకౌంటు లో ఉంచి మా అమ్మ ఇష్టం వచ్చినట్టు వాడుకోవడానికి ఏర్పాటు చేసారు. మా నాన్న గారు కాలం చేసిన తరువాత కూడా ఆ పద్ధతి లో ఏమి మార్పు లేదు. మా అక్కలు ముగ్గురికోసం, మా కోసం ఆవిడ ఇష్టం వచ్చినట్టు ఖర్చు చేస్తూ ఉంటుంది. కొడుకుల కంటే కూతుళ్ళు ఎక్కువ మా అమ్మకి అని పెద్దన్నయ్య . అప్పుడప్పుడు అనేవాడు. కూతురు సంధ్య పుట్టినతరువాత అలా అనడం మానేసాడు. ఆయనకి కొడుకు మీద కంటే కూతురు మీద అభిమానం ఎక్కువ అని మా పెద్ద వదిన అంటూ ఉంటుంది.నువ్వు అలా అనుకుంటావు కాని ఇద్దరి మీద ప్రేమలూ అలా పోల్చేవి కావు అనేది అమ్మ

నాకు పదిహేను ఏళ్ళు వచ్చేదాకా మాతాతగారి ఊరు తరచూ వెళ్ళేవాళ్ళం. ఆ తరవాత తగ్గి పోయింది. ఆఖరి సారి వెళ్లి పదిహేను

ఏళ్లయింది. ఇప్పుడు పెద్దన్నయ్య వెళ్ళ మన్నట్టే అప్పుడు నాన్న గారు పంపితే వెళ్ళడం జరిగింది. జ్ఞానం వచ్చినతరువాత చిన్న మావయ్యని దగ్గరగా పర్శీలించింది అప్పుడే.

చిన్న మావయ్యది అదో రకం వ్యక్తిత్వం. మా అమ్మమ్మ అనారోగ్యం కారణంగా చాలా కాలం వాళ్ళ తాత గారింటి దగ్గర పెరిగాడు. వాళ్ళ తాతగారు నిత్యాగ్నిహోత్రి, మడి ఆచారాలు అవీ ఎక్కువ. వాటి ప్రభావం వల్లో, గ్రామం లోనే ఉండిపోవడం వల్లో కాని, రెగ్యులర్ గా సంధ్యా వందనం, సాయంత్రం పూజ అన్నీ పట్టుపంచ కట్టుకుని శ్రద్ధ గా చేయడం చూసాను.ఇవేమీ ఫరవాలేదు. కాని కొన్ని మిగతా విషయాల్లో ఆయన ప్రవర్తన కొంచెం ఆశ్చర్య పరిచేదే.

నేను వెళ్ళిన మర్నాడు ప్రొద్దుట వాళ్ళ వీధి అరుగుమీద కూర్చుని పేపర్ చదువుతున్నాను. మావయ్య కొడుకు రామం , కూతురు బృంద ఇంటి ముందు పందిట్లో ఆడుకుంటున్నారు. ఇంతలో ఎవరో పొలం నుంచి కాబోలు వచ్చి పందిట్లో రాట దగ్గర నుంచున్నాడు. నాన్నా! నారయ్య వచ్చాడు అంటూ బృంద లోపలి కి పరిగెత్తింది. మావయ్య పూజ పూర్తిచేసుకుని పట్టు పంచ తోటే అరుగు మీదకి వచ్చి నుంచుని అతని తోటి మాట్లాడ్డం మొదలెట్టాడు. ఓ అర గంట దాక మాట్లాడుతూ నే ఉన్నారు. ఈ మధ్యలో వచ్చినతనికి, కాఫీ , టిఫిను ఇచ్చారు. పందిట్లో ఓ మూల పైన ఉంచిన ప్లేటు , గ్లాసు తీసుకుని తినడం తాగడం

అయ్యినతరువాత బృంద నీళ్ళు ఎత్తి పోస్తే కడిగి మళ్ళీ పైన పెట్టేసాడు. వెళ్ళబోతూ అతను మొలలోంచి కొంత డబ్బు తీసి అరుగు మీద పెట్టాడు. 'దింపు డబ్బండి' అన్నాడు అక్కడ పెట్టి వెనక్కి జరిగి. మావయ్య డబ్బు మీద కొద్దిగా నీళ్ళు జల్లి లోపలికి తీసుకెళ్ళాడు . ఏమిటి ఈ చాదస్తం అనుకున్నాను. ఇంతలో అత్తయ్య బృందని పిలిచి మావయ్యకి తువ్వాలు ఇమ్మని అరిచింది. అత్తయ్య నాకు రెండోమాటు కాఫీ ఇవ్వడానికి వచ్చినప్పుడు అడిగాను " అదేమిటి స్నానం చేసే కదా పూజ చేసాడు. మళ్ళీ స్నానం ఏమిటి? "

"నారయ్య తో ఎప్పుడు మాట్లాడినా ఇదే వరస. వాడు పట్టించు కోడు కాని వాడి కొడుకులు చదువు కుంటున్నారు. వాళ్ళు వచ్చినా ఇదే వరస. మళ్ళీ వాళ్ళ చదువులన్ని ఈయనే చెప్పిస్తారు. వాళ్ళు అంత పట్టించుకోరు" .అంది అత్తయ్య కొంత వివరణ ఇస్తూ.

మావయ్య స్నానం చేసి వచ్చి అరుగు మీదకి వచ్చి నాతో కబుర్లు మొదలు పెట్టాడు. బృంద, రామం మళ్ళీ వచ్చి పందిట్లో ఆడడం మొదలు పెట్టారు. ఇంతలో పీచు మిట్టాయి అమ్ముతూ ఒకడు వచ్చి పిల్లలిని చూసి ఆగాడు. పిల్లలు ఇద్దరూ కూడా తండ్రి దగ్గరకి పరుగెట్టుకి వచ్చారు కొనమని. "అది మంచిది కాదు " నేను టౌన్ వెళ్ళినప్పుడు తెస్తాను పోయి ఆడుకోండి" అన్నాడు మావయ్య . రామం మాట్లాడకుండా వెళ్ళిపోయాడు. కాని బృంద మాత్రం వెళ్ళలేదు . మొండి గా సతాయించడం మొదలెట్టింది. కాసేపు చూసి ఒక్కటేసి లోపలి కి పొమ్మన్నాడు. పోనీ కొనచ్చు కదా అని నాకు నాలుక దాకా వచ్చి ఆగాను . బృంద లోపలి కి వెళ్ళకుండా క్రింద పడి దొల్లడం మొదలు పెట్టింది. అత్తయ్య వచ్చి దాన్ని లోపలి కి తీసుకు వెళ్ళింది. దీనికి పంతం ఎక్కువేనే అన్నాను నవ్వుతూ. " అవునురా వాడిలా కాదు దీనికి పంతం ఎక్కువే. సద్దుకు కు పోయే మొగుడు రాక పోతే కష్టమే" అన్నాడు నవ్వుతూ.

రాత్రి భోజాల దగ్గర సీను వేరు. తండ్రి వొళ్లోకి చేరి అయన పెడుతోంటే కావలిసిన వన్నీ తింది . అది అడిగిందేదో వడ్డించలేదని అత్తయ్యను కూడా కసిరేడు మావయ్య.

మర్నాడు మావయ్య ఇచ్చిన డబ్బు తీసుకుని వచ్చేసాను . ఆ తరవాత మళ్ళీ ఇప్పుడే వెల్ల వలసి రావడం

మర్నాడు ఆఫీసు కి వెళ్ళగానే మా ఎండి తో చెప్పాను వెళ్ళవలసిన ప్రయాణం గురించి. లీవ్ గురించి . లీవ్ ఎందుకు? ఎలాగా అక్కడిదాకా వెళుతున్నారు కాబట్టి, బందర్ సుబ డివిజన్ ఆఫీస్ లో డిప్యుటి ఇంజినీరు , అసిస్టెంట్ ఇంజనీరుని లెంపక్కాయ్ కొట్టాడట. అక్కడ గొడవగా ఉంది. ఈఈ ఫోన్ చేసాడు. అది ఇన్వెస్టిగేట్ చేసి రిపోర్ట్ ఇవ్వండి అన్నాడు . కారు లో వెడుతున్నానని తెలిసి ఇంటర్నల్ ఆడిట్ రాఘవ కూడా నాతో బయలుదేరాడు. మర్నాడు ప్రొద్దుటే బ్రేక్ ఫాస్ట్ చేసి బయలుదేరాం. రాఘవ తో కబుర్లలో ఉండగా మూర్తి ఫోన్ చేసాడు. మూర్తి మా ఆఫీసు లో గ వర్నమేంట్ నుంచి వచ్చే సబ్సిడీ వ్యవహారాలూ చూసే సెక్షన్ కి ఇంచార్జ్ . రైతులకి మేము చేసే సేవలకి గాను ప్రతి ఏడాది ప్రభుత్వం మాకు బడ్జెట్ ద్వారా కొంత సబ్సిడీ రిలీజ్ చేస్తుంది. ముందుగానే అంచనాలు చూపించి మేము బడ్జెట్ ఫిక్స్ చేయించుకోవాలి. లేకపోతే

ఏడాదంతా కష్టం అవుతుంది.

" సార్ మన బడ్జెట్ లో పది కోట్లు కట్ చేస్తున్నారు. ఫైనాన్సు మినిస్ట్రీ నుంచి మన మినిస్ట్రీ కి వచ్చిన సమాచార మేమంటే స్టూడెంట్స్ ఫీజు బడ్జెట్ వల్ల మనదాంట్లో కోతట" అంటూ బాంబ్ పేల్చాడు. అదేమిటయ్యా. అలా చేస్తే మనకి చాలా ప్రాబ్లం అవుతుంది.నువ్వు మేనజ్ చేసి తగ్గ కుండా చూడు అని ఫోను పెట్టి దాని ప్రభావం ఎలా ఎదుర్కోవాలా అనే ఆలోచన లో పడ్డాను . ఓ అరగంట తరువాత మళ్ళీ చేసాడు. " ఏమయ్యా ఏమయింది ? అన్నాను ఆత్రుత గా. " చాలా కష్టం మీద ఒప్పించి పది కోట్లు కాకుండా రెండు కోట్లు మాత్రమే కట్ చేసేలా కన్విన్స్ చేసాను సార్ " అన్నాడు." ఓ! వేరి గుడ్ చాల బాగా మేనేజ్ చేసావ్" అని కట్ చేసాను.

ఎవరు నుంచి సార్ ఫోను? మూర్తి నుంచా ? అన్నాడు రాఘవ . అవును అతనే. నాకు మంచి సపోర్ట్. "గవర్నమెంట్ తో బాగా మానేజ్ చేసుకొస్తాడు. ప్రతి ఏడాది చూస్తున్నాను" అన్నాను మూర్తి ని మెచ్చుకుంటూ'

మీకో రహస్యం చెబుతాను సార్. మీ తోనే ఉంచుకోండి అన్నాడు నవ్వుతూ రాఘవ. "ఏమిటి?" అన్నాను కుతూహలంగా

" మూర్తి చాలా సిన్సియర్, హార్డ్ వర్కర్ సార్. కాని మీ దగ్గర మెప్పు కోసం చిన్న ట్రిక్ చేస్తాడు. మీరు 'నష్టం లో లాభం' టెక్నిక్ గురించి విన్నారా? " అన్నాడు నవ్వుతూ. " అదేమిటి ఎప్పుడూ వినలేదే? " అన్నాను

వినండి మీకు చాలా ఉపయోగపడుతుంది అని మొదలు పెట్టాడు " ఓ ఊళ్ళో ఓ పిసినారి షాహుకారు ఉన్నాడు. వాడి దగ్గర పనిచేయడం ఎవరికయినా కష్టమే. అతను ఓ మాటు తన దగ్గర పని చేసే రత్తయ్య ని బండి ఎడ్లు తీసుకుని ప్రక్క ఊళ్ళో మార్కెట్ నుంచి మూడు సిమెంట్ బస్తాలు తీసుకు రమ్మన్నాడు. ఎడ్లు కొత్త గా ఎక్కువ డబ్బు ఇచ్చి కొన్నాడెమో చాలా జాగర్తలు చెప్పి పంపించాడు. రత్తయ్య పోరుగూళ్లో సిమెంట్ కొని తిరుగుముఖం పట్టాడు. ప్రక్క ఊరికి వెళ్ళడం కాని రావడం కాని ఓ కాలవ ప్రక్కన ఉన్న రోడ్ మీదుగా ప్రయాణం చేయాలి. వీడు తిరిగి వస్తొంటే ఎదురుగా బస్సు రావడంతో ఎడ్లు కంగారు పడి కాలవ ప్రక్కగా లాగడంతో బండి ప్రక్కకి పడి ఎడ్లు కూలబడి సిమెంట్ బస్తాలు నీటిలో పడిపోయాయి. రత్తయ్య షావుకారు ఏమంటాడో అని ఎదుపుముఖం తోనే అతి కష్టం మీద ఎడ్లని ముందు విప్పి లేచిన్తరువాత మళ్లీ బండికి కట్టాడు. అక్కడ చేరిన జనం లో ఒకతను విన్ని చూసి ఎందుకంత . కంగారు పడుతున్నావు సిమెం టే కదా పోత అన్నాడు. " మా షావుకారు చంపుతాడు సార్ మూడు సిమెంట్ బస్తాలు ఖరీదు వసూలు చేయడం కాకుండా, పని లో ఉంచుతాడో లేదో నమ్మకం లేదు" అన్నాడు ఏడుపు ముఖం తో . మీ షావుకారికి 'నష్టం లో లాభం' చూపించు. వసూలు చేయడం అటుంచి నీకు బహుమతి కూడా ఇస్తాడు. ఇంటికి చేరగానే ముందు మీ షావుకారు తో " అయ్యా బండి ఎడ్లు సిమెంట్ తో సహా కాలవలో పడ్డాయి " అని చెప్పి కొంచెం ఆగు. ఆ తర్వాత మీ షావుకారు కంగారు పడడం అవగానే ' బండిని ఎద్దులకి ఏమి అవకుండా బయట పడ్డం

సార్ , సిమెంట్ మాత్రం పోయింది అని చెప్పు." అని సలహా ఇచ్చాడు. రత్తయ్య షావుకారు దగ్గర కి వెళ్ళగానే అలాగే మొదట చెప్పగానే షావుకారు గయ్యి మని లేచి, కొత్త ఎద్దులు బోల్డు డబ్బు పెట్టికొన్నాము కొంప ముంచావు కదరా అని అరవడం మొదలు పెట్టాడు. మనవాడు ఇచ్చిన సలహా ప్రకారం. లేదు బాబయ్య అంటూ రెండో భాగం చెప్పాడు. అది వినగానే షావు కారు తేరుకుని నవ్వు ముఖంతో పోనీలే సిమెంట్ పోతే పోయింది బండి ఎడ్లు బాగున్నాయి కదా " అని సంతోష పడ్డాడు. రాఘవ ఇది ముగించ గానే నాకు ఫ్లాష్ అయ్యింది

" అమ్మ మూర్తి! బండి ఎడ్లు బదులు పదికోట్లు పెట్టావా నాయనా !. అసలు వాళ్ళు తగ్గించింది రెండు కోట్లే అన్నమాట" అనుకున్నా.

రాఘవ నవ్వుతూ " మీరు గమనించి ఉండరు కాని ప్రతి ఏడు ఇది మామూలే సార్. మేం చెప్పుకుని నవ్వుకుంటూ ఉంటాం" మీకు తెలియనట్టే ఉండండి సార్ . గవర్నమెంట్లో పని వాడు తప్ప ఎవరూ అంత బాగా చేసుకు రాలేరు" అన్నాడు "అలాగే" అన్నాను 'ఇదేదో బాగుందే అనుకుంటూ".

బందర్ లో రాఘవ ని ఆఫీసు లో వదిలి, తిరిగి వచ్చేటప్పుడు ఇన్వెస్టిగేషన్ చేస్తానని 'ఈఈ' కి చెప్పమని, కుమార్ ని తాత గారు ఊరు పొమ్మన్నాను . చిన్న మావయ్య ఇంటికి చేరే టప్పటికి సాయంత్రం ఏడయింది . మావయ్య అత్తయ్య అరుగు మీదే ఉన్నారు. ఏమిటి ఇద్దరూ అరుగు మీదున్నారు? అన్నాను. లోపలి కి వస్తూ.ఏమీ లేదయ్యా 'బృంద ఇంకా కాలేజి నుంచి రాలేదు . ఇవాళ రామం వెళ్ళలేదు ఈపాటికి వచ్చేసేయాలి. స్కూటర్ తీసుకు వెళ్ళింది . అందుకు కొంచెం కంగారు."

" దానికి స్కూటర్ వద్దు, బస్సు లో వెడితే చాలంటే . తల్లీ కూతుళ్ళు స్కూటర్ కొనేదాకా నిద్దరోలేదు. " అన్నాడు మావయ్య రోడ్డు కేసి చూస్తూ.

"నన్నంటారేం మీరే దానికి గారం ఎక్కువ పెట్టారు " అంది లోపలి కి వెళుతూ.. నేను మావయ్యని కబుర్లలో పెట్టాను కొంచెం టెన్షన్ తగ్గిద్దామని. ఇంతలో రామం, బృందా ఇద్దరూ స్కూటర్ మీద వచ్చారు. " టి " జంక్షన్ దగ్గర ఫ్రెండ్స్ తో హస్కేస్తోంటే తీసుకు వచ్చాను" అన్నాడు రామం ఇద్దరూ బాగా పెద్దయ్యారు. ఇద్దరూ కూడా, కార్పోరేట్ విద్యల ధర్మమా అని దగ్గర లోనే ఇంజనీరింగ్ చేస్తున్నారు. ఇంటి నుంచే వెళ్లి రావడం చాలా కన్వీనిఎంట్ గా ఉందన్నాడు మావయ్య . మర్నాడు వాళ్ళ వ్రతం అంతా చూసి ఆ మర్నాడు మావయ్య ఇచ్చిన డబ్బు తీసుకుని బయలు దేరాను. అక్కడున్నంత సేపూ రామం నన్ను 'చిన్న బావ' అంటూ నన్ను వదల లేదు. బాగా దగ్గరయ్యాడు

బందరులో పని ముగించుకుని నేను హెడ్ క్వార్టర్స్ వచ్చేసాను. ఎం డి ని కలిసి బందర్ ఇన్వెస్టిగేషన్ రిపోర్ట్ ఇచ్చి. సబ్సిడీ బడ్జెట్ గురించి కూడా చెప్పాను. పదికోట్లు కట్ పెట్టారని . ఆయన వర్రీ అవడం మొదలెట్టగానే " ఎలాగో మానేజ్ చేసి రెండు కోట్లు మాత్రం కట్ అయ్యేఅలా చూసామన్నాను. మూర్తి ని తలుచుకుని . రెండు కోట్లయితే ఫరవా లేదు లెండి, బాగా మానేజ్ చేసారు

అన్నాడు మెచ్చుకుంటూ. టూర్ రిపోర్ట్ వేరే పంపుతానని చెప్పి వచ్చేసాను

రెండు సంవత్సరాలు ఢిల్లీ లో డెపుటేషన్ మీద పని చేసి మళ్ళీ డ్యూటీ లో చేరడానికి హైదాబాద్ నిన్ననే వచ్చాను . సుందరి, పిల్లలు రెండు నెలలు ముందే వచ్చేశారు . రాగానే ఎండి కి ఫోన్ చేసి మర్నాడు చేరుతున్నాను అని చెప్పాను. " వేరి గుడ్ జాయినింగ్ టైం తరవాత వాడుకున్నువు గాని రేపే వచ్చెయ్యి. చేరగానే నువ్వు అర్జెంట్ గా 'ఎస్ఈ' ని తీసుకుని ని రెండు రోజులు కడప వెళ్లి రావాలి. అక్కడ ఈ మధ్యనే కట్టిన అఫ్ఫీస్ బిల్డింగ్ బాగా క్రాక్స్ ఇచ్చిందట.స్టాఫ్ వర్రీ అవుతున్నారు. రిపోర్ట్ కావాలి " అన్నాడు నాకు ఛాయిస్ ఏమీ ఇవ్వకుండా. "సరే సార్ అన్నాను" సుందరి రియాక్షన్ ఆలోచించుకుంటూ. " నిన్నే కదా వచ్చారు . మళ్ళీ అప్పుడే రెండు రోజులు క్యాంపు ఏమిటి?" అంటుంది.

కాఫీ అందిస్తుండగా అన్నాను " రేపు చేరగానే ఓ వారం రోజులు కడప, కర్నూలు క్యాంపు వేసాడు మా ఎండి అన్నాను. రియాక్షన్ కి ప్రిపేర్ అవుతూ.

" నిన్నే కదా వచ్చారు . మళ్ళీ అప్పుడే వారం రోజులు క్యాంపు ఏమిటి?" అంది అప్ సెట్ అయి.

"నేను అదే చెప్పి "చచ్చి రెండు రోజులకి ఒప్పించాను అన్నాను " మూర్తి ని తలుచుకుంటూ.

"రెండురోజులయితే పరవా లేదు లెండి" అంది కాస్త మూడ్ మార్చుకుని. ఇంతలో ఫోన్ రింగ్ అయితే సుందరిని ఎత్త మన్నాను. ఆవిడ ఫోను ఎత్తి " ఊ చెప్పు "అంటూ బెడ్ రూం లోకి వెళ్లింది . అలా వెళ్లిందంటే వాళ్ల అక్క రాజ్యం గారు కాని, మా చిన్న అక్క లావణ్య కాని అయ్యుండాలి. అంటే ముప్పై నుంచి నలభై నిమిషాలు ఇన్కమింగ్ కాల్స్ బంద్.

ఇంచుమించు గంట తర్వాత వచ్చింది. ఏమిటి విశేషం అంతసేపు ? అన్నాను. ఏదో ఉందని ముఖ కవళికలు చెబుతున్నాయి.

" మీచిన్న మావయ్యగారి బృంద ఎవరో ఇతర మతం కుర్రాడిని పెళ్లి చేసుకుందట.

"అయ్యో! అదేమిటి? అన్నాను ? నిజం గా షాకింగ్ న్యూసే ! చిన్న మావయ్య తట్టుకోగలడా అనిపించింది. లాస్ట్ టైం వాళ్ళ ఊరు వెళ్ళిన తరువాత మధ్యలో ఓమాటు చిన్న అన్నయ్య కొడుకు పెళ్లి లో అందరూ కలిసాము. అప్పుడు తెలిసింది -బృంద,

చెన్నై లోనూ, రామం కొచిన్ లోనూ పని చేస్తున్నారని. ఇద్దరూ సాఫ్ట్ వేర్ కంపనీ లలో పనిచేస్తున్నారని తెలిసింది సుందరి చెప్పిన వివరాలు బట్టి లేటెస్ట్ ఏమిటంటే :-

"నాలుగు నెలల క్రితం ఎవరో కుర్రాడిని ఇంటికి తీసుకు వచ్చి, ఆఫీసు లో కొలీగు అని పరిచయం చేసిందిట . ఎ జాతో ఏమిటో అని అరుగు మీద కుర్చీ బల్లా వేసి భోజనం పెట్టారట. వీళ్ళకి అనుమానం వచ్చి మళ్ళీ వచ్చినప్పుడు మీ మావయ్య గుళ్ళోకి తీసుకు వెళ్లి ఒట్టు కూడా వేయించు కున్నారుట చెప్పకుండా ఏమీ చేయవద్దని . తరవాత మీ అత్తయ్యకి చెప్పిందిట ఫోన్లో ఫలానా మతస్తుడని '. ఉద్యోగం మానిపించి తీసుకువచ్చేద్దామనుకుంటూ ఉంటె టే ఓ నాలుగు రోజులు ఫోన్లో దొరక లేదట. మీ మావయ్యగారు చెన్నై వెళ దామనుకుంటుంటే మీ అత్తయ్య కి ఫోన్ చేసి. పెళ్లి చేసుకున్నాం, క్షేమం గానే ఉన్నాను వెతక వద్దని చెప్పిందిట. కుర్రాడి మతం తెలియగానే మీ మావయ్య గారు కళ్ళు తిరిగి పడి పోయి రెండు రోజులు మంచం లో ఉన్నారుట. రామం వచ్చి మీ మిగతా మావయ్యలకి చెప్పి పోలీసు సహాయం తో వెనక్కి తీసుకు వచ్చేద్దామని ప్రయత్నిస్తున్నారట."

ఆ తరవాత,సుందరి, మా చిన్నక్క లావణ్య ఫోన్లో తరుచు ఇదే డిస్కషన్. ఇన్ కమింగ్ కాల్స్ కష్టమయి పోయాయి. ఓ మాటు మా చిన్నక్కయ్య కొడుకు అమెరికా నుంచి నా సెల్ కి చేసాడు. " ఏమిటి మావ్వయ్యా మా లాండ్ లైన్ మీ ల్యాండ్ లైను ఎప్పుడూ బిజి గా ఉంటున్నాయి? అని. నేను సంగతి చెప్పాను. " ఓహ్! అదా రెండు ఆకలి గా ఉన్న సింహాలికి జింక దొరికిందన్న మాట " అని జోక్ చేసాడు

నాకు నిజంగా చిన్న మావయ్య మీద జాలేసింది. ఎలా తట్టుకో గలడు ఈ షాక్ అని. అంత ఆచారంగా ఉండేవాడు, కూతురి జీవితాన్ని మాంసం తినే ఇతర మతం వ్యక్తి తో ఊహించు కుంటూ నరకం అనుభవిస్తూ ఉండచ్చు. నాకే ఊహించుకుంటే చాలా బాధ గా ఉంది. ఆయనకి ఎలా ఉందొ ? . ఎందుకంత తొందర పని చేసింది బృంద? పర్యవసానాలు ఊహించిందా?

పది రోజుల తరువాత రామం తో మాట్లాడితే వాడు ఇంకొన్ని విషయాలు చెప్పాడు. ఆ కుర్రాడు , బృంద కంపెనీ కిఓ ప్రాజెక్ట్ పని మీద ఏడాది కింద వచ్చాట్ట , అప్పటి నుంచి వీళ్ళకి స్నేహం , మూడు నెలల క్రిందే ఇద్దరికీ ఒకే కంపనీ లో జాబ్ వచ్చింది , ఇక్కడ రిసైన్ చేసి కొత్త కంపనీ లో చేరడానికి నిర్ణయించుకుని , మధ్యలో పెళ్లి చేసుకున్నారు. .రిజిస్ట్రార్ ఆఫీసు లో పెళ్లి అయినతరువాత ఇద్దరూ ఎక్కడికి వెళ్ళారో ఫ్రెండ్స్ కి తెలియదు. బహుసా కేరళ లో అతని ఊరికి వెళ్లినట్టు సమాచారం. ఎక్కడున్నారో చెప్పకుండా అప్పుడప్పుడు బృంద మాత్రం అత్తయ్యకి ఫోన్ చేసి బాగానే ఉన్నానని చెప్పి ఫోను పెట్టేస్తోందట.

ఓ నెల తరవాత సుందరి ద్వారా తెలిసిన విషయాలేమంటే, వాళ్ళిద్దరూ చెన్నై వచ్చి జాబ్ లో చేరడం, ఆఫీసు కి దగ్గరగానే

ఫ్లాట్ తీసు కోవడం, రామం చెన్నై బ్రాంచి కి బదలీ చేయించుకుని దగ్గర లోనే ఫ్లాట్ తీసుకోవడం వగైరా. నార్త్ లో ఇటువంటి పెళ్ళిళ్ళకి కొందరు పేరెంట్స్ కన్నవాళ్ళన్న విషయం కూడా చూడకుండా దయా దాక్షిణ్యాలు లేకుండా చంపుకోవడాలు రోజూ పెపెర్లో చూస్తున్నా, దక్షిణా ది లో అలాంటి రియాక్షన్ తక్కువ. మావయ్య మాత్రం ఇంకా దానిని వెనక్కి తెచ్చేయాలని చూస్తున్నాట్ట. సాధ్యమయే పనేనా అనుకున్నా.

రెండు నెలల తరువాత రామం ఆఫీసు పని మీద హైదరాబాద్ వచ్చి కలిసాడు బృందా వాళ్ళూ బాగానే ఉన్నా, మావయ్య తిప్పుకో లేక పోతున్నాట్ట. రాత్రుళ్ళు నిద్ర ఉండటం లేదట. సడ్డెన్ గా రాత్రి లేచి తల గోడక్కొట్టుకోడం వంటి చేష్టలు చేస్తున్నాట్ట. కాస్త రిలీఫ్ ఉంటుందని తీర్ధాలు తిప్పినా లాభం లేకపాయింది. బాగా నీరసించి పోయాట్ట. "ఇలాగే ఉంటే నాన్న ఏమయి పోతాడో అని భయం గా ఉంది బావా " అని కళ్ళ నీళ్ళు పెట్టుకున్నాడు. నాకూ అలాగే అయ్యింది.

"వాళ్ళు హాపీ గానే ఉన్నారు కదా!. మీ నాన్న ఊళ్ళో వాళ్ళగురించి, బంధువుల గురించి ఎక్కువ అల్లోచిస్తున్నాడనుకుంటా" అన్నాను

ఇంతలో మూర్తి తలుపు కొట్టి లోపలి వచ్చి " సార ఓ ఫైల్ డిస్కస్ చేయాలి" అని రామాన్ని చూసి మళ్ళీ వస్తానని వెళ్ళిపోయాడు

మూర్తి ని చూడగానే నాకు. సడెన్ గా ఓ ఆలోచన వచ్చింది. "ఒరేయి నేనో సలహా ఇస్తాను ఆ ప్రకారం చెయ్యి. వర్క్ అవుట్ అవ్వచ్చని నా నమ్మకం. చూద్దాం. అవక పోయినా మనకి నష్టం ఏమీ లేదు" అని ఏంచేయాలో వివరం గా చెప్పి పంపించేస్సాను.

పదిహేను రోజులు తరువాత నేను ఓ ఆదివారం మధ్యాహ్నం ఇంట్లోపేపర్ చదువు కుంటూ ఉండగా , ఫోను రావడం ఫోన్ తీసుకుని సుందరి బెడ్ రూము లోకి వెళ్ళడం చూసాను. మళ్ళీ పేపర్ లో పడి ఆ విషయం మరిచాను. ఓ అర గంట తరువాత సుందరి వచ్చి పేపర్ లాక్కుని, "మీ రామం ఎం చేసాడో విన్నారా ?" అంది "ఎమయింది" అన్నట్టు చూసాను?

ఓ రోజు సడెన్ గా మీ మావయ్య గారికి ఫోన్ చేశాట్ట. బృందా వాళ్ళూ ఉంటున్న అపార్ట్మెంట్ బ్లాక్ లో ఓ ఫ్రెండ్ రామానికి ఫోన్ చేసి " మీ చెల్లెలు అపార్ట్మెంట్ దగ్గర చాలా జనం మూగారు. ఏమిటని ఎవరినో అడిగితే, ఆ ఫ్లాట్ లో అమ్మాయి ఆత్మహత్య చేస్కుందని చెప్పారు. నాకు వెళ్ళడం భయంగా ఉంది నువ్వు త్వరగా రా " అని ఫోన్ చేశాట్ట. వీడు అక్కడికి వెళ్లేముందు వాళ్ళ నాన్నకి ఫోన్ చేసి సంగతి చెప్పి వెంట్టనే వచ్చేయ్యమన్నాట్ట. వీళ్ళు లబో దిబో మని కారు లో బయలు దేరిన అరగంటకి మళ్ళీ ఫోన్ చేసి , కంగారు పడకండి ఆ అమ్మాయి బృంద కాదు అన్నాట్ట. అంత క్రితమే రెండు

రోజులు ముందు బృంద వాళ్ళు ఫ్లాట్ మారి ఇంకో చోటకి మారారట. కొత్త గా వచ్చిన వాళ్ళు ఎవరో తెలియదట.ఆ సంగతి రామానికి తెలియక కంగారు పడ్డాట్ట.మీ మావయ్య గారు వార్త రాగానే కారు ఎక్కుతూనే చాలా బాధ పడ్డారట. ఎక్కడో అక్కడ హ్యాపీ గా ఉందని వదిలేయకుండా, ఇన్నాళ్ళూ దాని ముఖం చూడకుండా దాన్ని చాలా బాధ పెట్టాము అని ఒకటే ఏడుపు ట. బృంద . కి ఏమీ కాలేదని తెలిసాకా పూర్తి గా మారి పోయారట. ఎవర్ని కట్టుకుంటే ఏమిటి ? పది కాలాల పాటు చల్లగా ఉంటె అదే చాలు అని అనుకున్నారట. అప్పుడే చెన్నై వెళ్లి బృంద ఉన్న ఇంటికి వెళ్లి కలిసి రెండు రోజులు అక్కడ హాప్పీ గా గడిపి వచ్చారట. రామాన్ని వాళ్ళకి ఏమి కావాలన్నా చూసుకో మన్నారట" ఏక తాటిని మొత్తం చెప్పేసింది.

లక్ష పోటేన్సి మందు పనిచేసిందన్న మాట అనుకున్నా మూర్తి ని మరో మాటు తలుచుకుని.కథ ఇక్కడ ముగించేయ్యచ్చు గానీ, అ తరువాత రెండు నెలలకి జరిగిన చిన్న ఘటన చెప్పి ముగిస్తే బాగుంటుం దనుకుంట. మూడు రోజులు చిత్తూరు ఆఫీసు పని మీద వెళ్లి తిరిగి బయలు దేరదా మనుకుంటుంటే,సుందరి ఫోను చేసింది . తను వాళ్ళ అన్నయ్య వాళ్ళతో తిరుపతి వస్తున్నానని, నేను కూడా అక్కడికి వస్తే నాతో పాటు తిరిగి తనూ వస్తా నని.

నేను తిరుపతి చేరుకునేటప్పటికి రాత్రి ఏడయింది. పద్మావతి టెంపుల్ దగ్గర ఉన్నాము అక్కడికి రమ్మని ఫోన్ చేస్తే తిన్నగా అక్కడికి చేరుకున్నాను .

నేను అక్కడికి చేరుకునేటప్పటికి అందరూ బిక్క మొహాలతో ఉన్నారు. ఏమయిందని కంగారుగ అడిగాను. ఏడుపుకు తక్కువగా, గుళ్ళో దొంగలు ఎక్కువ ఉన్నారని ఎవారో చెబితే నగలు మూట కట్టి హ్యాండ్ బాగ్ లో పెడితే క్యూ లో రష్ లో బాగ్ కట్ చేసి నగలు కొట్టే శా రట. సుందరికి నగల మీది ఎంత అటాచ్మెంట్ ఉందొ గుర్తుకు వచ్చి చాల వర్రీ అయ్య. ఇంతలోకి నా మొహం లోకి చూసి అదృష్టం బాగుందండి రెండురుమాళ్ళలో కట్టిన వాటిలో ఉంగరాలుమాత్రమే చిన్న రుమాలు మూటే పోయింది మిగతావి పోలేదట అని చెప్పగానే ఊపిరి పీల్చుకున్నాను. సమయానికి మీ అఫీసులో పనిచేసే మూర్తి గారు కనబడి పోలిస్ కంప్లైంట్ అది ఇచ్చి సహాయం చేసాడని చెప్పగానె, తిరుపతి ప్రయాణానికి మూర్తి శలవు తీసుకోడం గుర్తుకు వచ్చింది. వెంటనే ఇంకోటి కూడా ఫ్లాష్ అయ్యిన్ది. ఎలా పోయాయని చెప్పాలో వాడే సలహా ఇచ్చి ఉంటాడని. అమ్మ మూర్తి ! ఇంట్లో ఇంక అది ప్లే చెయ్యడానికి వీలు లేకుండా చేసావు కదయ్యా అనుకున్నా




"రాజేష్ నేను రమ్మనంగానే పార్క్ కు వచ్చినందుకు చాలా చాలా హాప్పీగా ఉంది. నిర్మానుష్యంగా, ఏ గొడవాలేని ఈ చెట్టుకింద మనిద్దరం మనసులు విప్పి మాట్లాడుకోవచ్చు. ఏవంటావు?"

"ఇట్స్ మై ప్లెజర్..నిజానికి ఇలాంటి అపర్చ్యునిటీ కోసం చాలాకాలం నుంచి ఎదురుచూస్తున్నాను. మన కాలేజీలో బ్యూటీ ఏంజెల్ వి. నీ కనుసన్నల్లో పడాలని ప్రతి కుర్రాడూ కల కంటాడు. నేను ఐ లవ్యూ చెప్పంగానే నీ ఎడం కాలిచెప్పు తీస్తావనుకున్నాను..అలాంటిది నన్ను ఈ పార్కుకు రమ్మనడం ఓహ్! నేనిప్పటికీ నమ్మలేకపోతున్నాను" రాజేష్ ఉబ్బి తబ్బిబ్బవుతూ మాటలను కూర్చాడు.

"అందగాడివి..డిస్టింక్షన్ తెచ్చుకునే బ్రైట్ స్టూడెంటువి, మర్యాదా మన్నన తెలిసినవాడివి..అందర్నీ చేసినట్టు, నిన్నెందుకు రఫ్ గా ట్రీట్ చేస్తాను? అయినా నీలాంటి వాళ్లని ఏ అమ్మాయి ఇష్టపడదు? అందుకే ఇలా పిలిచాను. అన్ని సబ్జెక్టులలో మంచి మార్కులు తెచ్చుకుంటూ..సివిల్స్ రాయాలని పట్టుదలగా ప్రయత్నిస్తున్నావని నాకు తెలిసింది. నేను మీ కాలేజీలో చేరినప్పటినుంచి నీ దృష్టి నా వైపు మరలింది, ఎంతలా అంటే మళ్లీ నువ్వు పుస్తకం వంక చూడనంత. అందమైన అమ్మాయిగా నాకిది గర్వాన్ని కలిగిస్తోంది. అందమైన దాన్నయినంత మాత్రాన నాకు కట్నం తీసుకోకుండా సంబంధం రాదు. మధ్యతరగతి కేరాఫ్ గా వున్న మానాన్న భారీకట్నమిచ్చి ఘనంగా నా పెళ్లి చేయలేడు. ప్రస్తుతం మనని ఆకర్షణ కలిపింది. అది ముందు ముందు మనిద్దరి అభిరుచులూ, అభిప్రాయాలు కలిసి గాఢమైన ప్రేమగా రూపాంతరం చెందుతుందన్నది నా ప్రగాఢ నమ్మకం.

మధ్యతరగతి లో పుట్టి, మధ్యతరగతిలో పెరిగి, మధ్యతరగతిలో బతుకీడ్వడం నాకు ఇష్టం లేదు. అందుకే నేను చదువు మీద చాలా కాన్సంట్రేషన్ చేస్తాను. నువ్వు కూడా సివిల్స్ కి ప్రిపేరై మంచి పొజిషన్ సొంతం చేసుకోవాలి. వివాహానంతరం మనిద్దరి జీవితం అది లేదు, ఇది లేదు అని సరిపెట్టుకుంటూ కాకుండా నల్లేరు మీద బండి నడకలా హాయిగా ఆహ్లాదంగా సాగిపోవాలి. అందుకని నువ్వు చదవాలి..బాగా చదవాలి..అనుకున్నది సాధించాలి. సాధిస్తావా?"అంది ప్రత్యూష.

సాధిస్తానన్నట్టుగా తల ఊపాడు.

అంతే.. వేగంగా అతని దగ్గరకు వచ్చి గట్టిగా కౌగలించుకుని పెదాలపై తియ్యని ముద్దుని ముద్రించింది. ఇద్దరి వెచ్చని ఉచ్ఛ్వాసనిశ్వాసలు ముఖాలపై మధురిమల గిలిగింతలు రేపుతూ స్వర్గధామానికి దారి చూపుతూ ప్రేరేపిస్తున్నాయి. అతని చేతులు ఆమెలోని అణువణువునూ కాంక్షాపూరితంగా తడుముతూ, మదనోద్రేకం చెలియలికట్ట దాటుతుందనగా ఆమె అతన్నుండి విడివడి "సారీ, ఇది జస్ట్ అడ్వాన్స్. నీకూ నాకు మధ్య ఓ ప్లెజెంట్ డీడ్. నువ్వు సివిల్స్ రాసి నువ్వేంటో ప్రూవ్ చేసుకున్నాక మనం మళ్లీ కలుద్దాం..నువ్వు అనుకున్నది సాధించగలవన్న నమ్మకం నాకుంది"అని చెప్పి హడావుడిగా హోండా ఆక్టివా ఎక్కి వెళ్లిపోయింది.

రాజేష్ జరిగింది కలా? నిజమా? అన్న మీమాంసలో చాలా సేపు అక్కడ ఉండిపోయాడు. శరీరంలోని మధుర ప్రకంపనలన్నీ అది నిజమేనంటున్నాయి.

నిదానంగా లేచెళ్లిపోయాడు.

*****

రాజేష్ కు చాలా సంతోషంగా ఉంది. సివిల్స్ కు సెలెక్ట్ అయ్యాడు. అదీ టాపర్గా. ప్రత్యూష ప్రేమను గోల్ గా పెట్టుకుని అసిధారావ్రతంలా, ధ్యేయంగా, దీక్షలా, తపస్సులా తపించి అనుకున్నది సాధించాడు. ఇప్పుడు గర్వంగా ఆమెని కలవబోతున్నాడు. ఇంతకాలం కలవలేదు, మాట్లాడలేదు. ఇన్నాళ్లకి కలవబోతున్నాడు. మొదటిసారి కలిసినప్పుడు అద్భుతమైన అనుభూతిని ప్రెజెంట్ చేసింది. ఇప్పుడు గిఫ్ట్ గా ఏమిస్తుందో? అతనిలోని ప్రణయరూపి 'మధురానుభూతులను ఎప్పుడెప్పుడు చవిచుడాలా' అని ఆత్రపడుతున్నాడు.

ప్రత్యూషను కలిశాడు. ఆమెలో ఏ మార్పూలేదు. అందం చెక్కు చెదరలేదు.

‘ప్రత్యూషా..నేను అనుకున్నది సాధించాను. నువ్వు నా మీద పెట్టుకున్న నమ్మకాన్ని నిలబెట్టాను. ఇహ మన ప్రేమమయ భవిష్యత్తుకు ఢోకా లేదు..నువ్వు ఊ అంటే..మన పెళ్లి త్వరలో.."అన్నాడు ఉద్విఘ్నంగా.

"కంగ్రాట్యులేషన్స్ రాజేష్. నాకు తెలుసు నువ్వు అనుకున్నది సాధిస్తావని. ఇప్పుడు నేను చెప్పేది సావధానంగా విను. నువ్వు సివిల్స్ సాధించావంటే మనిషిగా గొప్ప పరిణతి సాధించావని అర్థం. ప్రేమకు, ఆకర్షణకు నీకిప్పటికే తేడా తెలిసుంటుంది. సాధారణంగా ప్రేమ జీవితాలని నాశనం చేస్తుందని లోకం అనుకుంటుంది. కాదని మనం ప్రూవ్ చేశాం. చాలా ఆనందంగా ఉంది. ఇహపోతే నిన్నే ప్రాణంగా, నువ్వే లోకంగా ప్రేమించే మరదలు నీకుందన్న విషయం తెలుసుకున్నాను, మీ కుటుంబానికి నువ్వే ఆధారం. ప్రేమ పేరుతో వాళ్లందరి ఆశలూ కల్లలవడం నాకిష్టం లేదు. అందుకే నీ దృష్టిని చదువు వైపు మరల్చాను. నేను ఆరోజు కాస్త అడ్వాన్స్ అయ్యాను. అది లవ్ ట్రీట్మెంట్. ఫలించింది. రోగం తగ్గాక డాక్టరును, వైద్యాన్ని మరచిపోయినట్టు, ఆ ఇన్సిడెంట్ ను మరచిపో. ఇహ నీదైన జీవితాన్ని ఆనందంగా గుడుపు. నన్ను ప్రాణాధికంగా ప్రేమించే బావ ఉన్నాడు. త్వరలో అతనితో నా పెళ్లి. నువ్వు తప్పక రావాలి. ఐ విష్ యు ఆల్ ది బెస్ట్."అని వెళ్లిపోయింది.

కొద్దిసేపు రాజేష్ మనసు శూన్యమయింది..కాని క్రమంగా ఆ స్థానం అతని మరదలి రూపంతో భర్తీ అయిపోయింది.

సంతోషంగా ఇంటిదారి పట్టాడు..మెచ్యూర్డ్ రాజేష్!



" ఓరోరీ! రామారావ్ ! ఎన్నాళ్ళకెన్నాళ్ళకెణ్ణాళ్ళకు కనిపించావురా! ఆ రింగుల క్రాఫేదీ! కోర మీసమేదీ! చర్మపు నిగారింపేదీ! ఇలా అయ్యావేమోయ్ ? చ్ఛొ చ్ఛొ చ్ఛొ చ్ఛొ చ్ఛొ . టీ.వీ చూడవా? యాడ్స్ తెలిదా? ఎన్ని రకాల లేపనాలూ, నూనెలూ, ఇంకా ఎన్నెన్నో చెప్తునారు చూడట్లేదా! పొడుగు పెరిగేందుకు మందూ, లావు వచ్చేందుకు మందూ..ఇంకా "

" అంటూ రామారావును ఊపేస్తూ వాక్ ప్రవాహం సాగిస్తున్న వామన రావును ఆపి "నీ ధోరణి మాత్రం మారలేదోయ్! అదే ధోరణి. అదే వాగుడూ, అదే రూపూ.! నీ రూపం మాత్రం మారలేదుటోయ్ ఆ నల్లని జుట్టేదీ? ఆ గుబురు మీసమేదీ? ఆ మెరిసే కంటి చూపేదీ? ఈ సోడా బుడ్డి కళ్ళాద్దాలేంటో? ఈ బాన పొట్టేంటో! వయస్సు ప్రభావమోయ్ వయస్సు ప్రభావం? నీకైనా నాకైనా !" అన్నాడు రామారావు..

"అద్సరే ఇంతకీ ఎక్కడ ఉంటం? నీవెక్కడున్నా సరే ! ఇంద.. నా ఫోన్ నెంబర్ రాసుకో “ " ఎక్కడ వ్రాసుకోను? పెన్నూ లేదు, పేపరూ లేదు. ఊరికే అలా నడుచుకుంటూ మార్నింగ్ వాక్ కు వచ్చాను."

"నడుచుకుంటూ కాక మార్నింగ్ వాక్ కు ఎలా వస్తారోయ్! ఎగురుకుంటునా? ఐనా అలా ఎగిరే వయస్సా ఏంట్రా మనదీ !? మరేం కంగారు లేదు గానీ నే చెప్పింది విను. నవ గ్రహాలను చుట్టి, అరిషడ్ వర్గాలు వదలి, త్రిమూర్తులను దర్శించి, ద్వి విధాత్మలను గుర్తించి, పంచభూతాలను స్మరించి, పూర్ణతత్వాన్ని గ్రహించి, త్రిశాంతులు వచించి , చతుర్వేదాల పేర్లూ తలంచి, అష్ట పుష్పా లతో పూజించి, ముమ్మారు ప్రదక్షిణ గావిస్తే నా ఫోన్ కలుస్తుందిరా!" " ప్రదక్షణాలూ, సుదక్షణలు నాకు పడవని నీకు తెల్సు కదా! ఒరే వామన రావ్! నీ చాదస్తం లేశ మాత్రం కూడా తగ్గలేదురా! నీ ఫోన్ నెంబర్ గుర్తుండదు గాని పోనీ మీ ఇంటికి దారి చెప్పు " "ఓ అదెంతో సులువురా! అదో ఆ కనిపిస్తున్న చౌరస్తా బస్టాప్ నుండి ఎడం వైపు వెళితే కల్యాణ మంటపం వస్తుంది. దానికి ఎదురుగా విడాకులిప్పించడం లో సిద్ధ హస్తుడని పేరు గాంచిన వకీలు వంకర మూతి వాటేశ్వర్రావు గారి ఇల్లు దాటితే, ఒక పెద్ద మూడు గిలకల బావి వస్తుంది.

దాని పక్క నుంచి తిన్నగా వెళితే ఒక చిన్న పిల్లల హాస్పిటల్ వస్తుంది. దాని పక్క నుంచి వెళితే కోర్టు వస్తుంది. దాని కుడి వైపు నుంచి వెళితే ఒక వృద్ధాశ్రమం, దాని ముందు నుంచి తిన్నగా వెళితే ...." అని అంటున్న వామన రావును ఆపి, రామారావు " వెధవా! వయసైంది కానీ బుద్ధి మాత్రం మారలేదురా! ఇదిట్రా నీ ఇంటికి దారి చెప్పే వైనం? " అంటూ ఉగ్రుడయ్యాడు. " నీ బీ.పీ . పెంచుకోకు నాయనా! మరో తేలికైన చిరునామా చెప్తాను సరా! తిన్నగా కళ్ళు మూసుకుని ఇదే మైన్ రోడ్డు మీద మధ్యగా నడుచుకుంటూ రా! నిన్ను జనాలు తెచ్చి మా అల్లుడి కార్పొరేట్ హాస్పిటల్లో వేస్తారు , ఇక్కడికి దగ్గరగా ఉండేది అదొక్కటేలే. అప్పుడు మా అల్లుడ్ని అడిగితే నాకు కబురు చేయగానే మేడ దిగి వస్తాను." అని వామన రావు అనగానే, "తూ వెధవాయ్! పెళ్ళికి వచ్చి చావు మంత్రాలు చదివినట్లు చిర కాల మిత్రుడిని, వాడి కుటుంబాన్ని కలవాలనుకుంటే ఇదిరా చిరునామా చెప్పే విధానం . చూస్తాన్రా చూస్తా!" అంటూ కోపంగా పక్కకు తిరిగాడు రామారావు. కోపము నుబ్బును గర్వము – నా పోవక యునికియును దురభిమానము ని - ర్వ్యా పారత్వము నమనివి-- అంటున్న వామన రావు ను ఆపి " ఒరే ! వామనా! నీ పద్య పఠనం మాత్రం మాన లేదన్నమాట! ఇంకా ఎన్ని పద్యాలు నేర్చావురా!" అంటూ మిత్రుని వైపు తిరిగాడు రామా రావు.

"ఇంతకూ నీకెంత మంది సంతానం ? ఎక్కడ ఉంటున్నారూ! చెప్పావు కాదురా!? " అని అడిగాడు. “ఈగల్ జాతీయ పక్షిగా ఉన్న దేశంలో ఒకడూ, కంగారూ జాతీయ మృగంగా ఉన్న దేశంలో ఒకడూ ఉన్నారురా! నేను మాత్రం నా నెమలి దేశాన్ని వదలి రానని ఇక్కడే స్వయం విష్ణువు వద్ద ఉంటున్నానురా!

" ఏదీ నేరుగా చెప్పి చావవుగా ! ఇంతకూ మా చెల్లాయ్ ఎలా ఉంది?"

"బాగానే ఉండే ఉంటుందిరా! నీ చెల్లాయికేంరా హాయిగా వాళ్ళ పుట్టింటి కెళ్ళి ఉంటున్నాది."

"ఎంట్రా నీవు చెప్పేదీ! నిన్ను వదిలేసి పుట్టింటికెళ్ళిందా? ఎవరున్నార్రా ఇంకా ఆ పల్లెటూర్లో? ఆమె తల్లి దండ్రులు కాలం చేసారని విన్నానే!"

" ఏం, చేస్తే మీ చెల్లాయ్ హాయిగా వాళ్ళమ్మ ఒళ్ళో విశ్రాంతి తీసుకోను వెళ్ళి పోయింది, నా మానానికి నన్నొదిలేసి. " గద్గద స్వరంతో అంటున్న వామన రావు చూసి, రామారావు " ఓరినీ! ఇదీనీ ఇలాగుట్రా చెప్పడం? సారీరా! ఐ యాం రియల్లీ సారీ!” అంటూ భుజం తట్టాడు.

“ఉత్తిత్తి సారీ లేనా? కాస్త కాఫీ పోయించేదమన్నా ఉందా! పద నేనే పోయిస్తా ఆ కెఫే హౌస్ కెళదాం" అంటూ దారితీశాడు వామనరావ్.

" నీకిక్కడ కాలం ఎలా గడుస్తున్నదిరా!" నడుస్తూనే అడిగాడు రామారావు .

" ఏముందిరా! ప్రొద్దుటే నుదుట కన్నున్న వాడ్ని చూస్తాను. ఆ తర్వాత లంకా దహనం చేసిన వాడ్ని పదకొండు చుట్లు చుడతాను. ఆ తర్వాత క్రియా శక్తిని దర్శించి , అన్నపూర్ణా తల్లి దయ కోసం ఇల్లు చేరతాను. ఆ తర్వాత ఏడు కట్ల వాహనం ఎక్కాల్సిన దాన్ని కాస్త సేపు పర్యంకం మీద పెట్టి, 32 తెల్ల మెట్ల గుహలో తేనీరు పోసి, ఊరు పొమ్మంటున్న వారి వద్ద కెళ్ళి యుద్ధ భూమిలో సద్బోధ పఠించి, ఇచ్ఛా ప్రసంగాము గావించి, ఇదో ఇలా జామాత గృహం చేరుతాను."

" అబ్బా నీతో వచ్చిన తంటానే ఇది మొదటి నుంచి , ఏదీ సవ్యంగా చెప్పి… '

"చావను. చస్తే మా ఆవిడదగ్గర కెళ్తే చక్కగా చక్ర పొంగలీ, చక్కెర అరిసెలూ, హోళిగలూ, లడ్డూలూ చేసి పెట్టును. అదేప్పటికో గానీ నీ సంగతి చెప్పవేం? "

"నా సంగతేముంది ! నీవు తెలుగు పంతులుగా రిటైరైతే నేను గణిత మాస్టారిగా రిటైరై రెండు రెండ్లు నాలుగు చేస్తే, నాలుగు రెండ్లు ఎనిమిదయ్యాయి, మొదటి రెండు లోంచి ఒకటి మైనెస్సైతే ఆ ప్రధాన సంఖ్య అప్రధానంగా మారి పోయి ఏ సంఖ్యలతో చెలిమి పెట్టుకోక ఏ సరి సంఖ్య చెంతా చేరక ఏకో నారాయణో హరిః అని ఊర్లు పట్టుకు ఉధ్ధరిస్తున్నది. ఆ ప్రధాన సంఖ్య కు మరో ప్రధాన సంఖ్య లేనిదే ఈ ఎనిమిది సంఖ్య లేదు. ఐనా ఈ ప్రధాన సంఖ్య కిప్పుడు గుర్తింపూ గౌరవమూ ఏమీ లేవు. ఏం చేస్తాం చెప్పూ , అందుకే ఇక్కడ కాదు రమ్మంటున్న వాళ్ళాంతా చేరే చోట ఇంత చోటు కోసం వెతుక్కుంటూ వచ్చానా్రా!, నీవేమన్నా అక్కడ కాస్తంత జాగా నా కోసం వెతికి పెడతావా?"అన్న రామారావును ఆశ్చర్యంగా చూస్తూ " ఓరినీ! నీవూ కోడ్ ల్యాం గ్వేజిలో మాట్లాడ్డం ఎప్పటినుంచి మొదలెట్టావురా! రామూ!" "ఎన్నో అడుగులేస్తే వారు వీరవుతారంటారుగా, మరి నీతో ఈ 1800 సెకండ్లు గడిపానాయే ప్రస్తుతానికి అంత మాత్రం మారనా ఏంట్రా రామూ!" " ఒరే ఎన్నాళ్ళాకెన్నాళ్ళకు ఈ పిలుపు విన్నానా్రా! పదరా ఇద్దరం అక్కడే మన చివరి మజిలీ గడుపుదాం కలిసి మెలసీ "అంటూ రామారావును ఆలింగనం చేసుకున్నాడు వామన రావు.




"తాతయ్యా! ఇక్కడున్నారా! మీ కోసం ఇల్లంత వెతికి వస్తున్నాం. బామ్మ షాపింగ్ కెళ్ళింది. రాను కనీసం 4,5 గంటలు పట్టొచ్చు, మీరేంటీ ఇక్కడ?" అంటూ నా దగ్గరకొచ్చారు, శైలేష్ , సుమ --నా కొడుకు పిల్లలిద్దరూ. నేనంటే వాళ్ళకు చాలా ప్రేమ.

"హమ్మయ్య! బామ్మ బయటి కెళ్ళిందా? "అంటూ ఊపిరి పీల్చుకుంటున్న నన్ను చూసి " తాతయ్యా! మీరేమీ అనుకోకపోతే ఒక మాట అడుగుతాం, బామ్మంటే మీకెందుకింత భయమ. ఏనాడూ బామ్మ మాటకు ఎదురు చెప్పరు? ఆమె ఏదంటే అదే అంటారూ…"కుతూహలంగా అడిగింది మనవరాలు.

వారలా అడగ్గానే నా గత జీవితం అంతా నా కళ్ళ ముందు సినిమా రీలులా తిరిగింది. మా అమ్మా నాన్న గారూ, అక్కలు బాబాయిలూ అంతా గుర్తొచ్చి బాధతో నా కళ్ళ నుంచి నీరు కారసాగింది. " సో సారీ! తాత గారూ! మమ్మల్ని క్షమించండి. మిమ్మల్ని బాధ పెట్టాం" అంటూ ఇద్దరూ నా చేతులు పట్టుకున్నారు.

నేను కాస్తంత గొంతు సవరించుకుని " లేదర్రా! అప్పుడప్పుడూ ఇలా గతం నాకు గుర్తొచ్చి బాధేస్తుంటుంది. మీకు ఎప్పటి నుంచో చెప్పాలనుకుంటూనే ఉన్నాన్నా ! ఇలా కూర్చోండి! చెప్తాను.అంటూ మొదలెట్టాను. గతం గుర్తు చేసుకుంటూ.

--' అమ్మా నాన్నా నాకు పెట్టిన పేరు అనంత సుందర రామయ్య. మాది పెద్ద ఉమ్మడి కుటుంబం. మా ఇంట్లో ఇలా నేను ఒక్కడ్నే మద్రాసు వెళ్ళి చదువుకున్న వాడ్ని.ఈ రోజు నా జీవితం ఇంత అశాంతిగా ఉండటానికి కారణం నేను మోజు పడి , అమ్మా నాన్నల మనస్సుకు కష్టం కలిగించి , అందం ఊబిలో దిగి, ప్రేమ ప్రవాహంలో కొట్టుకు పోయి, చేసుకున్న నా వివాహ ఫలితమే. నేను మద్రాసు లో చదువుతుండగానే గుండు సూదులు తయారు చేసే కంపెనీ లో ఉద్యోగం వచ్చింది. చదువు అర్ధాంతరంగా ముగించి దాన్లో చేరాను, స్నేహితుల సలహాతో. మంచి ఉద్యోగిగా పేరు కూడా తెచ్చుకున్నాను. మా మేనేజరు దృష్టిలో పడ్డాను. ఆ తర్వాత ఆయన కూతురి వలలోనూ పడ్డాను. అదీ నా స్వయం కృతమే! ఆ రోజు నాకింకా బాగా గుర్తే! ఆ రోజున మానేజర్ మోహన రావు నన్ను తన ఇంటికి ఆహ్వానించాడు. పై అధికారి పిలిచినందున బావుండదని వెళ్ళాను.

" రా రా సుందర్! కూర్చో " అంటూ స్వాగతించాడు.

ఆయన భార్యను పిలిచి " చూడు ! చూడామణీ! ఇతడు మన వైపు వాడే ! ఆంధ్రుడు. పేరు సుందరం, మన కంపెనీ లో కొత్తగా ఉద్యోగంలో చేరాడు." అని పరిచయం చేశాడు.

"చిన్న సవరణండీ! నా పూర్తి పేరు అనంత సుందర రామయ్య! మా ఇంట్లో అంతా సుందరం అని పిలవటాన నేను నా పూర్తి పేరు మరిచే పోయాను. ఇప్పుడు ఉద్యోగంలో చేరాక పూర్తి పేరు సంతకం పెట్టాల్సి రావటాన గుర్తుకు వస్తున్నది " అన్నాను ఏదో

మాట్లాడాలి గనుక.

" భలే సరదా మనిషివోయ్! మా ఇంటి కొచ్చినందుకు చాలా సంతోషం! అప్పుడప్పుడూ వస్తుండు, మా అమ్మాయి ఏదో కొనాలని బయటికెళ్లింది" అంది ఆయన భార్య చూడామణి. కొంత సేపు పిచ్చా పాటీ మాట్లాడి వారిచ్చిన ఫల హారాలు సేవించి వెళ్ళాను.

ఒక ఆది వారం రోజు మానేజర్ గారి ఆహ్వానం మేరకు మళ్ళీ వారింటి కెళ్ళాను. ఒక అందమైన సుందరాంగి తలుపు తీసే సరికి భయంగా "ఇది మేనేజర్ మోహన రావు గారి ఇల్లేనాండీ!" అని అడిగాను ఒక అడుగు వెనక్కేసి. అంద మైన ఆరడుగుల నవ యువకుడ్ని ఎదురుగా చూసిన ఆ యువతి కూడా భయం గానే ," అవునండీ! మీరెవరు ?" అంది సిగ్గు పడుతూ.

" నన్ను సుందర రామయ్యంటార్లెండి. నేను మేనేజర్ మోహన రావు గారి ఆహ్వానం మేరకు వారి గృహాన్ని పావనం చేయను వచ్చాన్లెండి . వార్ని కాస్త పిలుస్తారూ?" అన్నాను తమాషాగా నవ్వుతూ, నా నవ్వే నాకు మరింత అందం చేకూరుస్తుందం టారంతా.

నా నవ్వుకు తమాయించుకుని " అయ్యో! కాస్తేలా పిలుస్తామండీ! పూర్తిగానే పిలుస్తాను, కాస్తంత రావడం కుదరదు గాండీ!" అంటూ నాకు రిటార్ట్ ఇచ్చి లోపలికి తుర్రుమంది ఆ నవ యువతి.

నా మాట నాకే అప్పగించినందుకు తడబడ్డాను. నెమలి కంఠం రంగు పట్టు పరికిణీ, లేత నీలం రంగు జాకెట్, ఆకాశం రంగు పమిట, బారెడు వాలు జడ ముందుకు వాలి, చివర బంగారు జడ కుచ్చులు మోకాల్ని తాకుతుండగా జడలో తురిమిన మల్లెలు ముందుకు చూసి ఫక్కున నవ్వి పలకరించగా నిరుత్తరుడనై చూస్తూ ఉండి పోయాను. ఆ యువతి నవ్వు నన్ను పడేసింది. అలా ఎంత సేపు ఉన్నానో కానీ, మేనేజర్ మోహన రావు గారు వచ్చి "ఏమోయ్! సుందరం! అలాగే నిలబడి పోయావ్ ! రారా లోపలికి."అంటూ ఆహ్వానించాక లోపలి కెళ్ళి కూర్చున్నాను ఒద్దిగ్గా.

ఇంతలో రెండు వెండి గ్లాసులతో వచ్చిందా అందాల రాసి మళ్ళీ. "సుందరం! ఇదో ఈమే మా ఏకైక కుమార్తె ' సుందరి" అని పరిచయం చేశాడాయన. నా ఒళ్ళు ఒక్క మారు జలదరించింది. ' ఏంటీ సుందరా!' అనుకున్నా లోలోపల.' అందానికి తగ్గ పేరు, నా పేరుకు జోడీ!" అని కూడా.

" తాగవోయ్! నిమ్మ మజ్జిగ. మా సుందరి మహ బాగా తయారు చేస్తుంది ఈ మజ్జిగ. ఎండలో పడి వచ్చావు గదోయ్ ! అందుకే చల్లని నిమ్మ మజ్జిగ " అంటూ గ్లాస్ అందించారు మోహనరావు గారు.

ఆ సుందరి వైపు తల వంచుకునే దొంగ చూపులు చూస్తూ మజ్జిగ మెల్లగా సిప్చేస్తున్న నాతో," ఏమోయ్! మజ్జిగ వేడిగా ఉందేంటి ! అలా సిప్ చేస్తున్నావ్ "అన్నారు మోహన రావు గారు. కిసుక్కున నవ్విందా సుందరి. ఆ నవ్వు నా మనస్సును మరింతగా దోచేసింది.

" లేదు లేదు సార్! చల్లగానే ఉన్నై " అంటూ గబ గబా ఒక్క గుటకలో తాగేసి గ్లాస్ అందించాను ఆమెకు. నవ్వుతూ గ్లాసులు అందుకుని లోపలికి వెళ్ళింది సుందరి. ఆమె వెనక్కు తిరగటంలో ఆమె బారు జడ గిర్రున తిరిగి నా ముఖానికి జడ కుప్పెలు తగిలాయి. ఆ స్పర్శకే నా ఒళ్ళు పులకరించింది. చూడామణి బయటికి వచ్చి " ఏం నాయనా! మా సుందరి ఇబ్బందేం పెట్ట లేదుగా? కొంచెం చిలిపిదిలే. ఒక్కటే కావటాన కాస్త గారాబం అంతే, మరొక్క పది నిముషాల్లో వంటైపోతుంది. నీవూ, ఆయనా మాట్లాడుతుండండి." అంది కొంగుకు చేతులు తుడుచుకుంటూ.

"అదేం వద్దండీ! ప్రతి సారీ భోజనం అదీ వద్దు. ఊరికే రమ్మన్నారు గదాని వచ్చానంటే!" మొహమాటంగా అంటున్న నన్ను చూసి, "అదేంటోయ్! మనమంతా ఒక్కటేగా ఆంధ్రులం, అందరం కలిసి భోజనాలు చేస్తూ బోలెడన్ని కబుర్లు చెప్పుకోవచ్చు" అంది చూడామణి .

" రోజూ పిలవకుండా వారానికో మారే పిలుస్తూన్నామనేమోనే అమ్మా!" అంది సుందరి, నన్ను కవ్విస్తూన్నట్లు సుందరంగా నవ్వుతూ. ఇహ ఊరుకో తలచ లేదు నేను, మామూలు గానే నేను కాస్తంత హాస్య ప్రియుడ్ని " రోజూ ఒక్క పూట ఏ మాత్రం కుదరదు. రెండుపూటలానూ.." అన్నను సీరియస్ గా. అంతా గల గలా నవ్వేశారు.

"ఓహో ఐతే వారాలకు ఎక్కువా వజ్రాలకు తక్కువానూ.." అని సుందరి అనగా,

"కాదు కాదు" అతిధులకు ఎక్కువా అభ్యాగతులకు తక్కువానూ.." అన్నాను, చిన్న తనంలో మా బామ్మ దగ్గర నేర్చుకున్న సామెతలూ, తెలుగు పదాలూ గుర్తు చేసుకుంటూ.." బాబోయ్ బాగానే బాణాలు పరస్పరం విసురుకుంటున్నారే ! ఇహ నేం కాల క్షేపానికేం తక్కువ కాదులేవే సుందరీ! " అంది చూడా మణి. మెల్ల మెల్లగా పరస్పరం మా చూపులూ నవ్వులూ, మాటల బాణాలూ ఎక్కువ కాసాగాయి. మమ్మల్ని చూస్తూ పెద్దలిద్దరూ గుంభనంగా నవ్వుకో సాగారు. ఆ నవ్వుల వెనక ఉన్న అసలు రహస్యం అప్పట్లో నాకు అర్ధమై చావలేదు. ఇదో ఇప్పుడిలా. ఒక్క నిట్టూర్పు విడిచాను వ్యర్ధంగా.

అలా మేమిద్దరం వారం వారం వాళ్ళింట్లోనే కలుస్తూ, పరస్పర ఆకర్షణకు లోనౌతుండగా, మా అమ్మా నాన్నాల వద్ద నుండి 'వివాహం చేసుకోమనీ, అమ్మాయిలను చూస్తున్నామనీ ఉత్తరాలు రాసాగాయి.' సుందరం! ఒక మారు వచ్చిపోరా! మంచి మంచి సంబంధాలు వస్తున్నాయి, నీ వివాహం జరిగితే మా బాధ్యత తీరుతుంది ' అని ఉత్తరాల మీద ఉత్తరాలు రాయగా రాయగా ,

"ఈవారం నేను మా ఊరు వెళుతున్నాను. రావట్లేదు సార్" అని ఆ ఆది వారం ఇంటికి ఆహ్వానించిన మోహన రావుతో చెప్పాను.

"అదేంటోయ్, ఏదైనా అత్యవసర కార్యమా ఏం?" అని అడిగాడాయన.

"ఔను సార్! మా వాళ్ళు పెళ్ళి సంబంధాలు చూస్తున్నారు. మాది ఉమ్మడి కుటుంబం, మా ఇంట్లో పెళ్ళికి నేనొక్కడ్నే మిగిలి పోయాను, నా కంటే చిన్న వాళ్ళైన మా బాబాయ్ ల పిల్లలందరికీ కూడా పెళ్ళిళ్ళై కొందరికి పిల్లలు కూడానూ. నేనొక్కడ్నే చదివి ఉద్యోగానికై బయటికి వచ్చిన వాడ్ని, మా బాబాయ్ కొడుకొక్కడున్నాడు, నాకైతే వాడికీ చేసే స్తారు. అందుకే ఇంట్లో వారు చాలా తొందర చేస్తున్నారు. వెళ్ళక తప్పదు సార్! అందుకే ఒక వారం పాటు సెలవు మంజూరు చేయమని మీకు సెలవు అర్జీ కూడా పంపాను. " అన్నాను ముఖ మాటంగా.

" చెప్పావు కాదేం! శెలవుకేం కానీ, ఈ వారం మహాబలిపురం వెళ్దామనుకున్నాం గా! అమ్మాయి బాధ పడుతుందని అందుకూ.." అన్నా డాయన.

"ఔననుకోండి ! కానీ మా నాయన గారు పెళ్ళి సంబంధాల గురించి, పిల్ల తల్లి దండ్రులను రమ్మని కోరారుట, తప్పదు సార్! మా నాయన గారి మాట పోతే బావుండదు. నేను వచ్చాక మరో వారం వెళ్ళవచ్చు." అన్నాను మెల్లిగా.

" ముందు నీవు అమ్మాయితో మాట్లాడు. సాయంకాలం ఓ మారు ఇంటికిరా! సుందరికి చెప్పకుండా వెళితే అది నీవు వచ్చేవరకూ అన్నం కూడా ముట్టదోయ్ ! బహు పెంకిది." అని ఆయన నన్ను ఇరికించాక నాంకిక తప్ప లేదు. ఆ రాత్రి వాళ్ళింటికి మోహన రావు గారే వెంట పెట్టుకు వెళ్ళాడు ఆఫీస్ అయ్యాక.

"మన వాడు మానేజర్ ను బాగా తైర్లో ముంచాడురోయ్ .."

"కాకేం ఎర్రగా బుర్రగా ఉన్నాడాయె! ఈ మానేజర్ కు ఒక కూతురుండి ఉంటుంది , ఈ అప్పనెవురు వదులుకుంటారు?"

" ఐతే ఆయన కూరుత్ను ఈ అప్పకిచ్చి పెళ్ళి చేస్తారంటావా?"

" కావచ్చు, లేకపోతే వెంటపెట్టుకు వెళతాడా! మనుషుల్ని కసురుకునే ఈయన ఈ అప్పని దగ్గరకు తీయటం, వెనుక అదే రహస్యం " అని వెనుక నుంచి తోటి ఉద్యోగులు అంటున్న మాటలు నా చెవిన పడకపోలేదు.

నా గుండేలో కలకలం రేగింది.' ఔను సుందరి చాలా అందగత్తె. మాట కారి, ఈయనేమో మా మానేజర్, ఈయనతో బంధుత్వం కుదిరితే నాకు మంచి ప్రెమోషన్ కూడా రావచ్చు, జీతం బాగా పెరగ వచ్చు. ఎవరో నాయన గారు కుదిర్చిన ముక్కూ మొహం ఎరగని పిల్లను చేసుకునే కంటే ఈ సుందరిని వీళ్ళు ఇస్తానంటే ఎందుకు చేసుకో రాదు? కాని నా అదృష్టం ఎలా ఉందో, ఊరి కెళితే నాయన గారికి విషయం చెప్పాలి.' అనుకుంటూ వారింటికి వెళ్ళా ను.

"ఏమోయ్ ఏదో ఆలోచనలో ఉన్నట్లున్నావ్? ఇబ్బంది పెడుతున్నామా!" అంటూ ఇంట్లో అడుగు పెడుతూ అడిగాడు మోహనరావు.

" అదేం లేదు సార్!" అంటూ లోనికి వెళ్లాను. "చూడామణీ! అమ్మాయ్ సుందరీ!ఎవరొచ్చారో చూడండి." అన్న మోహన రావు పిలుపుకు బయటికి వచ్చిన వారిద్దరూ ఆశ్చర్య పోయారు.

"అరే! సుందరం ! రావోయ్ రారా!" అని చూడామణీ ,

" ఓహ్! మీరా!" అని సుందరి పలకరించగానే,

" నేను మీరానూ కాను, రాధనూ కాను. కేవలం అనంత సుందర రామయ్యను " సీరియస్ గా అన్నాను. అంతా నవ్వేశారు.

“భలే నవ్విస్తారండీ మీరు" అంది సుందరి నవ్వుతూ. "ఏమ్మా! మద్రాసుకు రానే రాను..అంతా అరవ గోల తాత గారి ఊరెళ్ళి పోతానని మొరాయించావుగా! ఇప్పుడే మంటావ్?." అన్న మోహనరావుతో,

" నాకేం తెల్సు ఇక్కడ సుందర చతురుడున్నాడని" అంది సుందరి తమషాగా తల త్రిప్పి, చూపుల బాకులు నా మీదకు విసురుతూ, నయనానందంగా నవ్వుతూ. ఆ నవ్వు, ఆ చతురత నన్నెక్కడికి తీసుకు పోతుందో తెలిని నేను మాత్రం హాయిగా మురిసి పోయాను.

ఎలాగైతేనేం నన్ను మా ఊరు వెళ్ళకుండా ఆపారు ఆ ముగ్గురూనూ. ఆ ఆది వారం అంతా కల్సి సరదాగా మహాబలిపురం వీక్షించను వెళ్ళాం.

ఈ యాత్ర మా మధ్య అదేదో తెల్సుకోలేని బంధాన్ని ఏర్పరచింది.

మండపాలు, గోపురాలు, లైట్ హౌస్, బిగ్ రాక్ వున్న ప్రాంతం. అవన్నీ చూసే సమయానికి అంతా అలసి పోయాం.

"అయ్యో! సుందరం! మేమిక నడవ లేం, మీరిద్దరూ వెళ్ళి చూసి రండి, మేమిక్కడే కూర్చుంటాం" అని పెద్ద వారిద్దరూ అక్కడి లైట్ హౌస్ వద్ద క్రిందనే కూర్చుండి పోయారు.

అక్కడి నుంచి నేను చెలరేగి పోయి సుందరికి పాండవ రథాలు, అతి సుందరమైన సీ షోర్ టెంపుల్ చూపాను. అంతకు ముందు మా ఆఫీస్ స్టాఫ్ తో రెండు మార్లు వచ్చి ఉండటాన నాకవన్నీ కొట్టిన పిండే!." చూడు సుందరీ! ఇక్కడ ఈ విష్ణుమూర్తి దేవాలయం ప్రధానమైంది. పల్లవ రాజు ఈ దేవాలయాన్ని సముద్రం నుండి వచ్చే కోత నుండి శిలా సంపదని రక్షించడం కోసమే కాక విష్ణు ప్రీతి కోసం నిర్మించాడు. ఈ దేవాలయ నిర్మాణం జరిగాక సముద్ర కోత తగ్గిందని చరిత్ర కారులు అంటారు. ఇది ఇక్కడి ప్రసిద్ధ మహిశ మర్దని మందిరం, చూడూ ఈ కృష్ణ మండప శిల్ప కళ ఎంత బావుందో! ఆ శిల్పుల శక్తి సామర్ధ్యాలు అమోఘమైనవి కదూ!" అంటూ సుందరికి అన్ని వివరించి చెప్పాను.

ఇద్దరూ పక్కపక్కనే నడుస్తూ ఆ శిల్ప సంపద గురించి మాట్లాడుకుంటూ లైట్ హౌస్ దగ్గరి కొచ్చారు. సుందరి మెట్లెక్కేప్పుడు ఆసరాగా నా చేయి పట్టుకో సాగింది. నాలో విద్యుత్ తరంగాలు ప్రవహించ సాగాయి. దూరం నుంచి మా ఇద్దరినీ చూస్తూన్న మోహన రావు, చూడా మణి ఏదో మాట్లాడుకోడం చూసాను. దగ్గరికి రాగానే " ఎంత బావుందయ్యా ! మీ జంట. మా దృష్టే

తగిలేట్లుంది. " అంది చూడామణి.

"ఆగాగు, ముందు సుంద రం మనస్సు తెల్సుకోనీ" అని మెల్లిగా అన్నాడు మోహన రావు.

అందరం కల్సి, కబు ర్లాడుకూంటూ, జోక్స్ చెప్పుకుంటూ, నవ్వుకుంటూ ఇంటి వద్ద నుంచి చుడా మణి చేసి తెచ్చిన గారెలూ, లడ్డూలూ, పులి హోర కడుపు నిండా తిన్నాక," ఇహ బీచ్ ఒక్కటే మిగిలింది సార్! అది చూసేస్తే మనం మద్రాసు బయల్దేర వచ్చు, పొద్దు గూకే వరకూ ఉండటం ఎందుకూ!" అన్న నా మాటలతో అంతా లేచి, ఖాళీ ఐన సంచీలు భుజాలకు తగిలించుకుని నడుస్తూ మహా బలిపురం బీచ్ వద్ద కెళ్ళాం. బీచ్ చాలా అందమైనది. సాయం కాలం చల్లగాలిని ఆస్వాదిస్తూ అందరం కాసేపు నడిచి , అక్కడ దొరికే గవ్వలతో చేసిన వస్తువులు సుందరి సలహా మేరకు చాలానే కొనుక్కుని, తిరుగు ప్రయాణమయ్యాం.

ఆ మరుసటి శుక్రవారం నా శలవు అర్జీ ఇవ్వను ఆఫీస్ రూంలో ఉన్న మోహన రావు గారిని కలిసేందుకు వెళ్ళాను. "రావోయ్ రా! కూర్చో ఏంటీ శలవు కోసమేనా!"

"అవును సార్! గత వారం వెళ్ళనందుకు మా వాళ్ళకు చాలా కోపం వచ్చే ఉంటుంది. ఈ వారమన్నా వెళ్ళక తప్పదు. ఒక వారం పాటు శలవిస్తారా!" ఇబ్బందిగా చేతులు నులుముకుంటూ అడిగాను.

"సెలవుదేముంది కానీ, మేమూ మా అమ్మాయి సుందరికి పెళ్ళి చేయాలను కుంటున్నామయ్యా! నీ ఎరికలో ఏదైనా మంచి సంబంధం ఉంటే చెప్పూ." అన్నాడు మా బాస్.

" అయ్యో నాకేం తెలుస్తాయిసార్! ఎటూ మాఊరు వెళుతున్నా కదా! మావాళ్ళనడుగు తాను. మాది పెద్ద ఉమ్మడి కుటుంబం. మా బాబాయ్ లూ అంతా ఒక ఇంట్లో లాగానే ఉంటాం, పక్క పక్కనే, ఇంకా మా నాయన గారి తరఫునా చాలా మంది బంధుబలగం ఉన్నారు. తప్పక అడుగుతాను సార్! సమాచారం సేకరించే వస్తాను, మరి నా వారం శలవు విషయం " అన్నాను మళ్ళీని.

" అబ్బా శలవు శలవూ అంటూ పీక్కు తింటావేమయ్యా!! నీకెట్లా చెప్పాలో అర్ధం కావట్లేదయ్యా! అది సరే వారం కాక పోతే శలవు పది దినాలు తీసుకో! ముందుగా నీవు మా అమ్మాయి సుందరి గురించి నీ అభిప్రాయం చెప్పు." అని నిలదీశాడు .

" మీ అమ్మాయి కేమండీ అందమైనదీ, మాట కారీ, మంచి మనస్సు కలది. ఏకైక ముద్దుల బిడ్డ " అంటున్న నన్ను ఆపి,

" అవన్నీ కాదయ్యా! నీవు మా అమ్మాయిని పెళ్ళి చేసుకుంటావా!?     "అని నేరుగా అడిగేశాడు మోహనరావు.

ఆ ప్రశ్నతో బెంబేలెత్తి పోయాను. నేను ఊహించని, ఆశించని     ఆఫర్ !. సుందరిని తలంచుకోగానే నామనస్సు పులకరించింది. గుండె నిండా తీయని తలంపులు నిండి పోయాయి. చదువు లేకపోతేనేం? చక్కని అందం నా స్వంతమవుతుందా! ఐనా నాయన గారికి చెప్పకుండా వివాహ     విషయంలో తాను నిర్ణయాలు తీసుకోడం సబబు కాదు. ఏం చేయాలబ్బా! ఈయన్నే నాయన గారితో మాట్లాడమంటే సరి. ఏమైనా వారే ప్రస్తావించినపుడు సుందరిని వదులుకోడం అవివేకమే!' అనే ఊహలతో అయో మయంలో పడ్డాను, ఆరడుగుల, బంగారు రంగు, రింగుల జుత్తూ అందగాడిని, నవ యవ్వన యువకుడినైన నన్ను     ఆయన తన కుమార్తెకు అడగడం లో తప్పేముందీ అనిపించింది ఆ క్షణంలో నాకు .

"ఏమయ్యా! సుందరం మా అమ్మాయి నచ్చక పోతే చెప్పేయి ఫరవా లేదు. మా మామగారు ఎలాగూ ఏవో సంబంధాలు చూస్తూనే ఉన్నారు. మమ్మల్ని పిల్లను తీసుకుని బొబ్బర్లంక రమ్మని , పెళ్ళి చూపు లు ఏర్పాటు చేస్తామనీ ఒకటే ఉత్తరాలు రాస్తూనే ఉన్నారు. వెళదామనుకుంటున్నాం,     ఐనా తెలిసిన వాడివి గనుక నిన్ను అడుగుదామని అడిగాను, పైగా ఎవరో ముక్కూ మొహం, తెలీని వాళ్ళకు గారాబంగా పెంచుకున్న ఒక్కగానొక్క పిల్లను ఇవ్వను ఆలో చిస్తున్నా మంతే" అని చెప్పాడు మోహన రావు .

" అలా కాదు సార్ వివాహ విషయం నేను ఎలా నిర్ణయం తీసుకుంటాను చెప్పండి. పెద్దలు మా నాయన గారూ, అమ్మా, బాబాయిలూ ఉన్నారు, వారంతా చర్చించుకుని నిర్ణయించాల్సి ఉంది. వారి నిర్ణయమే నా నిర్ణయం అవుతుంది సార్!" " అన్నాను ముఖమాటంగా .

" అది సరేనయ్యా సుందరం! నీకు ముందుగా మా కుటుంబం గురించి కొంచెం     చెప్తాను విను. అంటూ ఆయన చెప్పిన మాటలేవీ నాకు చెవి కెక్క లేదు. సుందరి నా స్వంత మైతే ఎంత బావుంటుందో ఊహించుకుంటూ ఉండి పోయాను. చివరగా అయన చెప్పిన ఆస్థుల గురించిన మాట వినిపించి,

" ఆస్థుల గురించిన ప్రస్థావన ఎందుకు సార్! ఏదైనా నిర్ణయం మా నాయన గారిదే. మాకూ ఆస్థి పాస్థులున్నాయి. మీరు మీకు

ఇష్టమైతే మా నాయన గారిని సంప్రతించండి సార్!"

"అది సరేనయ్యా సుందరం! నీ ఉద్దేశ్యం చెప్తే బావుంటుంది. మీ వాళ్ళు అంగీకరిస్తే నీవు కాదంటే అప్పుడు మేమేం చేయాలయ్యా?"

" అలా ఉండదు సార్! సుందరి వంటి అందమైన అమ్మాయిని ఎవ్వరూ వదులుకోరు , " అన్నాను కాస్తంత సిగ్గు పడుతూనే. " అబ్బా! ఈ మాట నీ నోటి వెంట చెప్పించను ఎంత సేపు పట్టిందయ్యా నాకు. మంచిది, నీకు మీ నాయన గారి పైనా, మీ పెద్దల పైనా ఉండే గౌరవానికి నాకెంతో సంతోషంగా ఉంది. నీ ఉద్దేశ్యం ప్రకారం మీ వాళ్ళకు ఉత్తరం వ్రాస్తాను. తర్వాత నేను వచ్చి మాట్లాడతాను. సరా!"

" ఐనా మీరు మీ అమ్మాయి ఉద్దేశ్యం కూడా తెల్సుకుంటే బావుంటుందేమో సార్! కాని నేను ఈ వారం వెళ్ళక పోతే మా నాయన గారు చాలా బాధ పడతారు. నేను చదువు కుంటానంటే నా కోసం కరిణీకం కూడా మా బాబాయ్ గారి పిల్లలకు ఇచ్చి నా కోరిక మేరకు నేను ఉద్యోగం చేసుకోను ఇంత దూరం పంపారు. వారిని బాధ పెట్టి నేనేం చేయలేను సార్! అంతే కాదు నేను వెళ్ళే వేళకు వారు గానీ ఏ సంబంధమైనా ఖాయం చేసి ఉన్నా కాదనలేను" ఎంతో స్థిరంగా చెప్పాను వారికి, ఒక విధంగా తొందర చేసినట్లే. ఆఫీసు కాగానే మా బాసు ఇంటికి వెళ్ళాను. " రావయ్యా! రారా! నీ కోసమే ఎదురు చూస్తున్నాం. భోజనం వడ్డిస్తున్నరు, తింటూ మాట్లాడుకుందాం రావయ్యా!" అని బలవంతాన భోజనానికి కూర్చోబెట్టాడు.

" చూడూ సుందరం! మీ ఇద్దరికీ కొంత స్నేహమైంది, సుందరి నిన్ను తప్ప మరొకర్ని చేసుకోను ఇష్ట పడటం లేదయ్యా! పసిది. అది బాధ పడుతుంటే మేం ఉండలేము. నీవు మీ ఊరి చిరునామా ఇవ్వు. మేమూ నీతో పాటే బయల్దేరుతున్నాం. నీవు మీ ఊరెళ్ళు. మేము మా ఊరెళ్ళి మా మామ గార్ని తీసుకుని వస్తాం, అన్ని విషయాలూ మీ వాళ్ళతో మాట్లాడి సంబంధం ఖాయం చేసుకుంటాం. మీ నాయన గారూ, మీ ఇంటి పెద్దలూ అంగీకరిస్తే నీకేం అభ్యంతరం లేదుగా! " అని అడిగాడు. తల వంచుకునే అంగీకారంగా తల ఊచాను. కాని లోపల్లోపల ఏమవుతుందోని భయంగానే ఉంది.' ఒక వేళ నాయన గారు ఏదైనా సంబంధం ఖాయం చేసేసి మాట ఇచ్చేసి ఉంటే, అప్పుడు ఏం చేయాలి' ఆలోచనలతో ఏమీ పాలు పోక సరిగా భోజనం చేయలేక పోయాను.

భోజన పళ్ళెంలో చూపుడు వేలుతో అటూ ఇటూ గీతలు గీస్తున్న నన్ను గమనించిన చూడామణి " నాయనా! భోజనం సరిగా చెయ్యి, ఆ తర్వాత ఆలోచిద్దాం, ఏందయ్యానీవు ! భోజనాల దగ్గరా ఈ మాటలన్నీ పాపం పిలగాడు అయోమయంలో పడ్డాడులా ఉంది సరిగా భోజనం చేయలేక పోతున్నాడు. కానీవయ్యా! నాకు మాత్రం ఆ బ్రహ్మ మీ ఇద్దరికీ వ్రాసి పెట్టి నట్లు అనిపిస్తున్నది. లేక పోతే ఇంత కాలంగా మా బిడ్డ సుందరి ఎవ్వరితో చనువుగా ఉండిందీ లేదు, ఇష్ట పడిందీ లేదు. పసిది. మీ ఇద్దరికీ స్నేహం కుదరటం అంతా దైవానుగ్రహమే. పైగా మీ వాళ్ళుమాత్రం నీ మనస్సు కాదని మరో సంబంధం ఎలా

చేస్తార్లేవయ్యా! నీవంటే మీ వాళ్ళకు ప్రాణమన్నావు కదా!" అంటూ ఓదార్చి భోజనం అడిగడిగీ వడ్డించారు చూడామణి.

మోహన రావు, చూడామణి ల ఆలోచన ప్రకారం అంతా బయల్దేరి రైల్వే స్టేషన్ కెళ్ళాం. ప్రయాణమంతా సుందరి, నాతో గలగలా మాట్లాడుతూనే ఉంది. మా నవ్వులూ , చనువూ చూసి మోహన రావు దంపతులు సంతోషించారు.

*************

ఇంట్లో అడుగు పెట్టగానే ఇంటిల్లి పాదీ నన్ను చూసి సంతోషించారు, చుట్టు ముట్టారు." రారా సుందరం! నీ కోసం ఎంతో కాలంగా కళ్ళళ్ళో వత్తులు వేసుకుని ఎదురు చూస్తున్నాం రా! " అంటూ తల నిమురుతూ తల్లీ, వళ్ళంతా చల్లని చూపులతో తడిమి చూస్తున్న తండ్రీ , బాబాయిలూ, పిన తల్లులూ, అత్తా, మామా, వారందరి సంతానం షుమారుగా యాభై అరవై మంది చుట్టూ మూగి తమ సంతోషం వ్యక్త పరిచారు. చాలా కాలం తర్వాత నా రక్త సంబంధీకుల ప్రేమ వానలో తడిసి ముద్దైనాను. 'వీరందరికీ తానంటే ఎంత ప్రేమ! ఇలాంటి వారికా తాను ఇంత కాలం దూరంగా ఉంది ' అని నా మనస్సు విలవిల్లడింది.

వారికి తాను మహాబలిపురంలో సుందరి సాయంతో కొన్న పూసల హారాలూ, గాజులూ, బొమ్మలూ అందరికీ ఇచ్చాను." మేమంటే నీకెంత ప్రేమరా !" అంటూ చిన్న పెద్దా అవి తీసుకుని సంతోషించారు. స్నాన పానాదులయ్యాక , " రా సుందరం! మీ నాయన గారు, అమ్మా! నీ కోసం ఎదురు చూస్తున్నారు.." అంటూ పెద్ద బాబాయ్ కృష్ణ మొదలు పెట్టాడు.

"ఏం చేయను బాబాయ్! శలవు దొరికింది కాదు." అంటూ మొదటి సారిగా పెద్దల ఎదుట అసత్యం చెప్తూ సిగ్గుతో తల వంచుకున్నాను, మనస్సు రోదిస్తున్నా.

" సరే కానీ జరిగి పోయిందానికి జగడాలెందుకు. జరుగవలసినది చెప్పు అన్నయా ! " అంది మేనత్త మాలతి.

" నాయనా సుందరం! గత వారం నీవు వస్తావని ఎంతో ఎదురు చూశాం , నేనిచ్చిన మాట ప్రకారం ఒక సంబంధం వారు మన కోసం వచ్చారు.

ముగింపు వచ్చేసంచికలో...




గతసంచికలో ఏం
జరిగిందంటే..http://www.gotelugu.com/issue154/3947/telugu-stories/jeevanasamaram/

వారిది ఎంతో సాంప్రదాయ కుటుంబం. వారు ఇంటికి పెట్టుకున్న పేరే ' అద్వైతాలయం', ఆ శ్యామ శర్మగారి సతీ మణి పేరు ఉభయ భారతి. నిజంగానే ఆమెకు అటు సంస్కృతంలోనూ, ఇటు తెలుగులోనూ అపార జ్ఞాన సంపద ఉన్నట్లు ఆమె ముఖ వర్చస్సే చెప్పక చెపుతుంది, ఇహ వారి కుమార్తె పేరు సహన, కుమారులు సోహం, ఓంకార్, అంతా అద్వైత మయం. కుటుంబ మంతా సంస్కృత విద్వాంసులే. పసి పిల్లాడిని పలకరించినా భజ గోవిందం శ్లోకాలూ, నమకం, చమకం చకచకా చెప్పేస్తున్నారు. ఊర్లో వారికున్న గౌరవం ఇంతింతనరానిది. అంతా వారి పేరు వింటేనే మనుషులు కనిపించక పోయినా చేతులెత్తి నమస్కరిస్తున్నారు. అలాంటి ఇంటి పిల్లను మనింటి కోడల్ని చేసుకోడం మనకే గౌరవ ప్రదం. నీ సమ్మతే ఆలస్యం, వారికీ మన ఉమ్మడి కుటుంబం, మన కుటుంబ సభ్యుల ప్రేమ అప్యాయతలూ, ఒళ్ళు దాచుకోకుండా ఆడ మగ అంతా ఇటు ఇంటికీ అటు గ్రామానికీ చేస్తున్న మేలు చూసి చాలా సంతోషించారు. ఉభయులకూ అన్నీ నచ్చాయి, నీవు పిల్లను చూసి 'ఊ' అంటే ఇహ పెళ్ళి ఖాయం చేస్తాం." వివరంగా చెప్పాడు తండ్రి . ఆ మాటలు వినగానే నా గుండెలో రాయి పడినట్లయింది.

" సుందరం! మనం ఈ రోజు మధ్యాహ్న భోజనాలు కాగానే వారి ఊరికి వెళుతున్నాం ,నీవూ, నేనూ మీ అమ్మా, అత్తా, పెద్ద బాబాయ్ ! నీవూ చూచేస్తే తర్వాత మనం ముహూర్తం గురించి మాట్లాడుకుందాం . సరా!" అన్నారు నాన్నగారు.

ఏమీ చెప్ప లేక నేను" మరీ మరీ! .." అని నానుస్తుండగా " అంతా పెద్ద వాళ్ళం కదా అన్న గారూ ! సుందరానికి తోడుగా మన చిన్నాడు సుదర్శన్ ను కూడా తీసుకెళదాం , మన రెండు గిత్తల బండిలో అందరం పడతాంలే అన్నయ్యా! " అని , " ఒరే సుదర్శన్ ను పిలవండిరా! " అని అనగానే ఐదు క్షణాల్లో మూడో బాబాయ్ కొడుకు సుదర్శన్ వచ్చి వాలాడు, వాడొక్కడే నాలా పెళ్ళికి ఉన్నాడు మా ఇంట. సుదర్శన్ కూడా అందగాడు ఎస్ ఎస్ ఎల్సీ వరకూ చదివి తండ్రికి సాయం చేస్తూనే మా ఇంట నడుస్తున్న చేనేత వస్త్రాలయం లో పని చేస్తున్నాడు.

నేను కుడితిలో పడ్డ ఎలుకలా ఏమీ చెప్పలేక గుంజాటనలో ఉండగానే, మధ్యాహ్న భోజనం పూర్తై అంతా తయారైనారు. రెండు గిత్తల బండి వచ్చి వాకిలి ముందు ఆగింది. లోపలంతా మెత్తని పరుపుల మీద తెల్లని దుప్పటి కప్పి ఉంది." రా నాయనా సుందరం! రాహు కాలం, దుర్ముహూర్తం రాక ముందే వారింట అడుగు పెట్టాలి. " అని తల్లి పిలవగా మారు మాట్లాడ లేక బండెక్కాను. దారి పొడవునా ఆ ఇంటి వారి మర్యాదలూ, వారి నిరాడంబరత గురించి, సుందరం ఉద్యోగం, జీతం, అక్కడి పరిస్థితుల గురించి మాట్లాడుతుండగానే వారి ఊరు చేరటం, వారింటి ముందు బండి ఆగటం జరిగి పోయాయి. బండి ఇంటి ముందు ఆగగానే ఒక పెద్దాయన పాండిత్యంతో ముఖం వెలిగి పోతుండగా భుజమ్మీద కండువాతో చేతులు జోడిస్తూ వచ్చి, బండి దిగను ఒక కుర్చీ పీట వేయించాడు. ఆయనే శ్యామ శర్మ ఐఉంటాడు అనుకున్నాను.ఈ లోగా పెద్దంచు చేనేత చీరలో పమిట చెంగు భుజం చుట్టూ కప్పుకుని, పచ్చగా పసుపుతో ఉన్న ముఖంపై పెద్ద కానీ అంత ఎర్రని కుంకుమ బొట్టుతో సాక్షాత్ పార్వతీ దేవిలా ఉన్న ఆమె బయటికి వచ్చి, బండి దిగను ఆడ వారికి సాయంగా చేయి అందించింది. బండి దిగి ఆ ఇంటి పరిసరాలు ఒక్క మారు చూచిన నా మనస్సు ఉద్వేగంతో నిండి పోయింది. ఆఇంటి వాతావరణం నాలో నూతనోత్సాహాన్ని కలిగించగా ఆసక్తిగా అందరితో కల్సి లోనికి నడిచాను.

అందరికీ కాళ్ళూ చేతులూ కడుక్కోను ఒక పది పన్నెండేళ్ళ పిల్లవాడు నీరు అందించగా, మరో పిల్లడు చేతులు తుడుచు కోను కండువా అందించాడు. అంతా పాద ప్రక్షాళన చేసుకున్నాక, పెద్ద లోగిట్లోకి వెళ్ళి కొయ్య కుర్చీల్లో కూర్చున్నాం. స్త్రీల కోసం కొత్త తుంగ చాపలు పరిచి ఉన్నై.అంతా కూర్చున్నాక నాతో పాటుగా సుదర్శన్నూ పరి చయ చేశారు పెద్దలు. ముందుగా కమ్మని, చిక్కని నిమ్మ మజ్జిగ అందరికీ అందించారు ఆ మగ పిల్లలిద్దరూనూ. ఆడవారికి ఆ మహిళ అందించింది ఆదరంగా. తాము ఇంటి నుండీ తెచ్చిన పండ్లు, పూల బుట్ట బండి తోలు కొచ్చిన చలమయ్య చేత తెప్పించి అక్కడ ఉంచింది సుందరం మేనత్త.

ఆ తర్వాత " అమ్మాయిని చూస్తారా!" అని అడిగారు శ్యామల శర్మ గారు. నాన్న గారు తల ఊచగానే "ఉభయ భారతీ ! సహన ని తీసుకురా!" అన్నారు.

నాతో పాటు సుదర్శన్ కూడా ఉద్వేగంగా ఎదురు చూట్టం నేను గమనించక పోలేదు. ఒక మయూరం పురి విప్పినట్లు, హంస నడకతో గుప్పుమనే మొగలి రేకుల సువాసన విరజిమ్మగా, నవ యవ్వన సుందరాంగి, పచ్చని పట్టు పరికిణీ, లేత ఆకు పచ్చ ఓణీ ధరించి, ముదురాకు పచ్చ జాకెట్లో మోకాళ్ళు దిగిన జడ చివర జడ కుప్పెలు నడుం క్రిందుగా వ్రేలాడుతుండగా, నేల తల్లికెక్కడ

నొప్పెడుతుందో అని అతి మెల్లగా నడుస్తూ వచ్చి చాప మీద స్త్రీల పక్కన కూర్చుంది తల్లితో కల్సి. చంద్ర బింబాన్ని తలదన్నే కాంతి నిండిన ప్రసన్న వదనం క్రిందికి దించుకుని కూర్చున్నా ఆ ముఖం లోని ప్రశాంతత , నిశ్చలత పసిమి ఛాయలో ఉన్న ఆమె ముఖ కమలాన్ని చూసి అంతా తృప్తి పడ్డారు. నా మనస్సు ఎందుకో తెలిని ఒకలాంటి భావనతో, నా స్వంత చెల్లాయిని మొదటి సారిగా చూసిన భావనతో నా మనస్సు నిండి పోయింది. "ఏమైనా అడుగుతారా !" అన్న గృహస్తు మాటలకు అంతా నా వైపు చూశారు. నేను తండ్రి వైపు' ఏమీ లేదని' తల ఊచి చెప్పాక , "బాబూ! ఈమె మాఅమ్మాయి సహన! బయటి బడుల కెళ్ళలేదు కానీ ఇంట్లోనే అన్నీ నేర్చుకుంది. వీణ మీద స్వర బద్ధంగా కీర్తనలు వాయిస్తుంది. వీళ్ళిద్దరూ మా కుమారులు సోహం, ఓంకార్," అనగానే వారిద్దరూ చేతులు జోడించి నమస్కరించడం అందరికీ ముచ్చటేసింది.

నా మనస్సు పరిపరి విధాల పోతున్నది, మింగ లేక కక్క లేక నానా అవస్త పడ సాగాను.' అలాంటి వారిని మోసం చేయటం, బాధించడం చాలా ద్రోహంగా భావించాను. మనస్సులో మాట చెప్పేద్దామా అని కూడా అనుకున్నాను కానీ మా బాస్ మోహనరావు మాట కూడా మన్నించల్సి ఉండటంతో నా నోటికి తాళం పడినట్లైంది. ఆయన వచ్చే వరకూ నోరెత్తవద్దని చెప్పాడు.' కనుక మూగ వానిలా తల వంచుకు కూర్చున్నాను.

" మరింక మేం కదులుతాం, చీకటి పడేలోగా గ్రామం చేరాలి కదా! మేము వెళ్ళాక మా తమ్ముడితో ఏ విషయం కబురంపుతాం." అని లేచాడు నాన్న గారు.

" ఒక్క క్షణం వదిన గారూ !" అంటూ ఉభయ భారతి లోనికెళ్ళి పసుపు కుంకుమ లున్న పళ్ళెం తెచ్చి మహిళ లిద్దరికీ బొట్టు పెట్టింది. సహన వారిద్దరి కాళ్ళకూ పసుపు రాచింది. పండ్లూ, పూలూ ఆడ వారిద్దరికీ ఇచ్చాక , సహన ఎవ్వరూ చెప్పకుండానే వారిద్దరి పాదాలకూ వంగి నమస్క రించి అందరి వైపూ ఓ చూపు చూసి లోని కెళ్ళింది. ఆ చూపు తన కేసే అనుకున్న నా గుండెలో వాడి, వేడి శూలం దిగింది.

అంతా బయటికి వచ్చి బండెక్కేప్పుడు ముందుగా వచ్చిన సుదర్శన్ తో " ఏరా ! ఆ అమ్మాయి బావుందా!" అనడిగాను.

"ఓరీ ఆప్రశ్న నేను నిన్ను అడగాలను కుంటున్నానురా! నీవు నన్ను అడుగుతున్నావు?" ఆశ్చర్యంగా అంటున్న సుదర్శన్ తో " ఒకవేళ నీవు నా స్థానంలో ఉంటే ఏమంటావురా! " అన్నాను. "అనేందుకేముంది ఇప్పుడు ఇలా చెప్పడం తప్పు కాని నీవు అడుగుతున్నావు కనుక చెప్తున్నాను. ఈమెను వద్దనే వాడు వెధవాయి అవుతాడు రా సుందరం," అని నాలుక్కరుచుకున్నాడు సుదర్శన్ , చుట్టూ చూస్తూ ఎవ్వరూ విన లేదు కదానే భయంతో.

పెద్దలు బయటికి వచ్చేలోగా సంభాషణ అంతా గుస గుసగా జరిగినందున, మేమిద్దరం తేలిగ్గా ఊపిరి పీల్చుకుని బండెక్కాం.

తిరుగు ప్రయాణంలో మా నాయన గారు నన్ను చూస్తూ అడిగారు. "ఏరా సుందరం! అమ్మాయిఎలా ఉంది? నీకు నచ్చిందా! సమ్మతమేనా?" అని ఆయన అలా అడుగుతుంటే ఏమీ చెప్పలేక తటపటాయించాను. "పాపం ఎలా చెప్తాడులే అన్నయ్యా! సిగ్గు కదూ!ఐనా ఆ అమ్మాయికేం కన్నువంకరా, కాలు వంకరా? వద్దన్న వాడు మూర్ఖుడో, మానసిక వికలాంగుడో ఐవుండాల్సిందే! " అంది అత్త.

" ఏరా సుందరం! మాట్లాడు, అంతా నీ సమాధానం కోసం కాచుక్కూచున్నాం. వారూ పెద్ద మనుషులు. అసలు అక్కడే చెప్తావనుకున్నాం, పసి వాడివి బిడియ పడతావని, ఎక్కువ బలవంత పెట్టలేదులే!" అన్నాడు బాబాయ్." ఏం సుందరం అంతా అడుగు తుంటే మాట్లాడవు! నీవు నోరు తెరిచి చెప్తే కదా నీ మనస్సులో భావన తెలిసేది?" అంది చివరగా తల్లి.

" పాపం పట్నం వాడు కదా! మరి కాస్తంత సమయం కావాలేమో! ఏరా! సుందరన్నయ్యా!?" అని మాట్లాడి తెల్సో తెలికో గట్టెంక్కించాడు సుదర్శన్ తాత్కాలికంగా.

"ఏం పిల్లలో ఏమో అన్నయ్యా! మగ పిల్లలు ఆడ పిల్లల కన్నా సిగ్గుల మొగ్గలై పోతున్నారు. చూడూ ఆ రోజు మన చిన్నన్న పిల్లడు హరి గోపాల్ కూడా అంతే, చివరకు ఈ సుదర్శనే వాడ్ని మాట్లాడించి వాడి మనస్సు తెల్సుకుని మనకు చెప్పాకే కదా! సంబంధం ఖాయం చేసి వివాహం జరిపించాం. ఇదీ వీడికే అప్పగిస్తే సరి. ఏరా సుదర్శన్! సుందరన్నయ్య మనస్సు తెలుసుకుని రేపటి కంతా చెప్పేయాలి." అంటూ ఆర్డర్వేసింది మేనత్త.

మరునాడు ఉదయం నేను ఆరు బయట వేప చెట్టు క్రింద మంచంపై పడుకుని, మా బాస్ కోసం ఎదురు చూడసాగాను. మధ్యాహ్నం వేళకు మోహన రావు, ఆయన మామ గారితో కల్సి వచ్చి బండి దిగాడు.

నేను ముందుగా వారిని చూసినా " సుదర్శన్ ! ఎవరో వచ్చినట్లున్నారు చూడూ!" అంటూ పిలిచాను. సుదర్శన్ వచ్చి బండి దిగుతున్న వారిని " తమరు ఎవరి కోసమండీ! " అని అడిగాడు. నా పోలికలతో ఉన్న సుదర్శన్ ను ఆశ్చర్యంగా చూస్తూ " బాబూ! ఇది కరణం గారి ఇల్లేనా?" అని అడిగాడు.

"ఔనండీ! రండి లోపలికి. మా పెద నాన్న గారు లోపల ఉన్నారు." అంటూ వారిని ఆహ్వానించాడు. ఒక పక్క గా నేను చెట్టు

క్రింద ఉండటాన వారికి కనిపించ లేదు. వారు పందిరి క్రిందకు రాగానే సుదర్శన్ కాళ్ళూ చేతులూ కడుక్కోను నీరందించాడు. వారు పందిట్లోని కొయ్య కూర్చీల్లో కూర్చోగానే, అక్కడే ఉన్న కుండలోని నీరు త్రాగేందుకు అందించాక, లోపలికి వెళ్ళి, " అమ్మా! పెద్దమ్మా! పెద నాన్న గారి కోసం ఎవరో వచ్చారు." అని చెప్పి తాను నా వద్దకు వచ్చాడు..

" సుందరన్నయ్యా! ఎవరో పెద నాయన గారి కోసం వచ్చినట్లున్నారు." అని చెప్పాడు.

లోపలి సంభాషణ ఆ గదికి పక్కనే ఉన్న కిటికీ నుంచి మా చెవుల పడుతుండగా, నా గుండె గడ గడలాడసాగింది. సుదర్శన్ " సుందరన్నా! నీకు మరో సంబంధం వచ్చినట్లుంది. అందుకేనా నీ గుండె దడదడలాడుతున్నది. నీకే సంబంధం ఖాయం చేయర్లేరా! నిన్నటి అమ్మాయి తప్పి పోతుందని భయపడకు. నేనున్నాగా నీకు, ఆపద్బాంధవుడిలా ఆదుకుంటాలే. వీరి అమ్మాయి ఎలా ఉన్నా సరే నీ కోసం నేను చేసేసుకుని పెద నాయనగారి గౌరవం కాపాడతాను. " అంటూ తెలీకుండానే మాటిచ్చేశాడు సుదర్శన్. నేను లోలోన 'అపశకునాలు పలక్కురా నాయనా! నాకు ఈ అమ్మాయి, నీకు నిన్నటి అమ్మాయీ నూ..' అనుకున్నాను మనస్సులో .

" సుదర్శన్ తమ్ముడూ నీవే ఎలాగైనా ఈగండం గట్టెక్కించాలిరా! నిన్నటి అమ్మాయీ నీకు నచ్చింది కదరా !"

" తప్పురా! వదిన వరసయ్యే అమ్మాయిని అలా మాట్లాడకు." అన్నాడు సుదర్శన్ చెంపలు వాయించుకుంటూ.

" సరి సరి. కానీ ఈ అమ్మాయినే నేను ఇష్ట పడితే నీవు నిన్నటి అమ్మాయిని చేసుకోను తయారేనా!" అన్నాను.

" అదెలా సుందరన్నయ్యా! నిన్నటి అమ్మాయిని నీ కోసం చూశారు. వారూ నిన్నే పెళ్ళి కొడుగ్గా భావించారు.."

" సుదర్శన్ ! పరిస్థితులు ఎలా మారినా నాకు నీసహాయం కావాలిరా! మాటివ్వు ." అని చేయి చాచి మాట తీసుకు న్నాను. లోపల మాటలు కొంచెం కొంచెంగా వినిపిస్తుండగా చెవులు రిక్కించి విన సాగాను, కాస్త సేపయ్యాక తండ్రి నుంచి పిలుపు రాగానే నేను చేతుకు కట్టుకుని లోనికి వెళ్ళాను, దడ దడలాడే గుండెలతో. అప్పుడే ఆయన్ని చూస్తున్నట్లుగా " అయ్యో! మీరా సార్! కులాసానా? ఎప్పుడొచ్చా రు?" అని పలకరించాను.

" వీరిని నీవెరుగుదువా ?" తండ్రి ప్రశ్నకు " ఈయన మా ఆఫీస్ మేనేజర్ గారు. వీరి ఫ్యాక్టరీలోనే నేను పని చేసేది, " అని చెప్పాను తల పక్కకు త్రిప్పి .

అంతా అర్ధమైనట్లు తల ఊచి "ఓహో అలాగా ! వీరి అమ్మాయిని నీకిచ్చి వివాహం చేయాలని అడగను వచ్చారు. నీకు వీరమ్మాయి తెల్సా?" గంభీరంగా తండ్రి అడిగిన దానికి గతుక్కుమన్నాను, ఆయనంత నేరుగా అలా అడుగుతాడని ఊహించ లేదు. లేకపోతే మోహన రావును పలకరించక పోను. ఏమీ చెప్ప లేక మౌనం వహించాను.

" అయ్యా! మీరు మాతో వచ్చి మామనవరాలు సుందరిని చూసి, మీ అభిప్రాయం చెప్తే బావుంటుంది." అ న్నాడు మా బాస్ మామ గారు." అవసరం లేదయ్యా! మా వాడు చూసి ఇష్ట పడ్డాక మేం చూడాల్సిన పని లేదు. మీ కెప్పుడు కుదిరితే అప్పుడే వివాహ ముహూర్తం నిశ్చయించండి, మేమూ వచ్చి నాలుగు అక్షింతలు వేస్తాము." అని లేచి, " ఒరే ! కృష్ణా వీరికి మీ ఇంట భోజనాదికాలు ఏర్పాటు చెయ్యి, పాపం చాలా దూరం ప్రయాణించి వచ్చారు, వీరిని మీ ఇంట్లోకి తీసుకెళ్ళు, అలాగే సుదర్శన్ ను నా వద్దకు పంపు, నేను కచేరీ గదిలోఉంటాను. "అని "వెళ్ళి స్నానాదికాలు ముగించి భుజించండి బాబూ! " అని చెప్పారు నాన్నగారు. ఆయన తన గది లోకి వెళ్ళాక తెల్లబోయి చూస్తున్న మోహన రావు గారిని, వారి మామ గారిని వెంట పెట్టుకుని వెళ్ళాడు కృష్ణ బాబాయ్ తన ఇంట్లోకి.

లోలోపల నేను గజగజా వణుకుతూ ఏం జరుగుతుందోని మౌనంగా ఎదురు చూడ సాగాను. పెద నాయన గదిలోకి వెళ్ళిన సుదర్శన్ ఐదు క్షణాల్లో వచ్చి, నన్ను తీసుకుని వేప చెట్టు నీడలోకి వచ్చాడు.

" ఒరే సుందరం! కొంప మునిగిందిరా! పెదనాయనగారు నన్నుపిలిచి ' ఒరే సుదర్శన్ ‘నిన్నటి పిల్లను చూశావు గా, ఆమెను నీవు చేసుకుని మన పరువు నిలపాలిరా! లేక పోతే నేను తలెత్తుకు తిరగ లేను.' అన్నార్రా! ఇప్పుడు నేనేం చేయాల్రా!" అన్నాడు గాభరాగా.

" నీవు నాకు మాటిచ్చావు గుర్తుందా! నాయన గారు చెప్పిందానికి అంగీకరించి నా ప్రాణమూ, నాయన గారి పరువూ నిలుపు, బంగారం లాంటి భార్యా మణిని వరించు" అన్నాను భారం తీరిన హృదయంతో.

" అంతేనంటావా! సుందరన్నా ! నేను ఆమెను ఆ భావనలో చూడనే లేదు." అని సుదర్శన్ అనగా,

' ఆశొక్కింతయు గలదు , ధైర్యమా పూర్తిగ పోయె ,

ప్రాణంబులున్ దడదడమనగ గుండెలయతప్పె మూగనైతి,

నీవేతప్ప ఇతరసాయం బెరుగ, హెల్పియన్ నీవే తగుదువు

రారాముందుకు సుదర్శనా ! బాబయ్య కొడుకా! ఓ బాల నేస్తమా!-- అంటూ డ్రామా స్టైల్ లో మోకాళ్ళపై కూర్చున్నాను చేతులు జోడించి. సుదర్శన్ పకపకా నవ్వి," నీవు మద్రాసీవైనా నీ హాస్యం మాత్రం పోలేదురా అన్నాయ్! "

" సరే కానీ నిన్న నే నిన్ను అడిగాను ఆమెపై నీ ఉద్దేశ్యం ఏంటని గుర్తుందిగా, ఒరే ఇవి చేతులు కావు కాళ్ళను కో " అని సుదర్శన్ రెండు చేతులూ పట్టుకున్న నాతో ,

"ఏరా! అన్నా ! నేను చేతులతో నడిచి కాళ్ళతో అన్నం తినే వాడిలా కనిపిస్తున్నానా మీ మద్రాసీలకు?" అన్నాడు సుదర్శన్.

ఆ సాయం కాలానికి మోహనరావు, ఆయన మామ గారూ కృష్ణ తో మాట్లాడి తిరుగు ప్రయాణమయ్యారు. ఆ రోజే తన మూడో తమ్ముడి కొడుకు సుదర్శన్ తో, సహన వివాహం నిశ్చ యించుకునే విధంగా కబురు పంపారు నాన్న గారు, శ్యామ శాస్త్రికి..

ఆ రాత్రి అంతా భోజనాలయ్యాక ఆరు బయట చేరాం. మా బాబాయిలకూ, అత్తలకూ అందరి ఇళ్ళూ ఒకే లాగా వరుసగా ఈ కాలపు రో హౌసెస్ లాగా కట్టించారు మా నాయన గారు, మాది విడి విడి వంటల్లాగా ఉండే ఉమ్మడి కుటుంబం. మా ఇంట ఏ నిర్ణయమైనా కానీ అంతా అలా ఆరు బయట చేరి నాన్నగారు చెప్పేమాటలు విని తమ అభిప్రాయాలు ఆయన అడిగినపుడు మాత్రమే చెప్పడం వాడుక. ఆ తర్వాతే ఏ నిర్ణయమైనా తీసుకునేది. అంతా మౌనంగా ఉన్నారు. నాన్న మనస్సు తెలికుండా ఎవ్వరూ ఏమాటా అనక పోడం ఆ ఇంటి సాంప్రదాయం.

" ఐతే నీవు మీ బాస్ మోహనరావు కుమార్తెను వివాహమాడ దలచే వారిని ఇక్కడికి పంపావన్నమాట"అన్నారు నాన్న గారు.

"అది కాదు నాయన గారూ!.." అని ఏదో చెప్ప బోతున్న నాతో, "ఆగరా! నీ మనస్సు వేరే చోట ఉన్నపుడు నాయన గారికి కానీ నాకు కానీ చెప్ప వలసింది. అనవసరంగా పై వారి ముందు నాయన గారి పరువేమై పోనూ? మంచి పిల్లవాడు కనుక సుదర్శన్ ఆ ఇంటి పిల్లను చేసుకుందుకు అంగీకరించాడు, లేక పోతే పరాయింటి పిల్లను అలా రెండు మార్లు వెళ్ళి చూడటం ఎంత పరువు తక్కున! వారి మర్యాదేమై పోనూ? " అంది గంభీరం గా అమ్మ.

"ఒరే! ఇక్కడ నిన్నెవ్వరూ బలవంతం చేసి నీ మనస్సుకు విరుద్ధంగా చేసే వారు లేరని నీకూ తెల్సు. ఒక్కగా నొక్క మగ బిడ్డవు నీ సంతోషమే అమ్మా నాయనా కోరుకునేది, అలాంటి వారిని ఇరకాటంలో పెట్టేశావురా సుందరా!" మందలింపుగా అంది మేనత్త.

" వీడు పెళ్ళయ్యాక మాత్రం మమ్మల్ని చూస్తాడనే నమ్మకం నాకు పోతున్నది , వీడి వాలకం చూస్తుంటే .. మద్రాసుకు పంపడం వంద్రై కూర్చున్నట్లుంది" అంది కొంత బాధగానే అమ్మ.

" రాజీ! అపుతావా! ఎవరి ముఖాన ఆ బ్రహ్మ దేవుడు ఎలా రాసి పెట్టి ఉంటే అదే జరుగు తుంది కానీ ఎవ్వరూ ఎవ్వరి జాతకమూ మార్చలేరు. అంతా సుఖంగా ఉండాలని మాత్రమే మనం కోరుకుందాం." అన్నారు నాయన గారు గంభీరంగా.

" సరి సరి, మరి నీవు వివాహం అయ్యేవరకూ ఉండి వెళతావా! మళ్ళీ వస్తావా! సుందర్ !" అడిగారు బాబాయిలు.

ఇంతలో శ్యామశాస్త్రి నుండీ కబురందించను వచ్చాడు ఆయన బావమరిది .

ఆ సమాచార సారాంశం అందరి మనస్సులకూ స్వాంతన చేకూర్చింది. "అయ్యా! మా బావయ్య గారు తమ కుమార్తె ఈ ఇంటి కోడలు కావాలని వాంచిస్తున్నారు. పైగా మరో విషయం అది దైవ చిత్రమే కావచ్చు, మా సహన మీరు నిశ్చ యించిన సుదర్శనే పెళ్ళి కుమారుడనుకుందిట ! ఒకే ఒక్క మారు నమస్కరిస్తున్న సమయంలో మాత్రమే ఆమె తలెత్తి చూసినపుడు సుదర్శన్ తన వైపు చూడటం తో అతడే పెళ్ళి కుమారు డనుకుందిట. మాకేమీ అభ్యంతరం లేదు, మీరు ముహూర్తాలు నిశ్చయించుకోను ఎప్పుడు వచ్చేదీ కబురంపమన్నారు." అని చెప్పగానే అంతా నిశ్చింతగా గుండెల నిండా గాలి పీల్చుకున్నారు. కానున్న కార్యం గంధర్వులే తీర్చారనటం ఇదేనేమో అనుకున్నారంతా మనస్సుల్లో.

ఆ తర్వాత నా వివాహం సుందరితోనూ, సుదర్శన్ వివాహం సహనతోనూ ఒకే ముహూర్తానికి మా ఇంటనే జరిగి పోయాయి. సహన ఎదురైతే ఆ తర్వాత నా మనస్సులో ఒక ముల్లు దిగినట్లు ఉండేది. ఆమె తన స్వంత అత్తా మామలనే కాక

పెద్దలనందరినీ మా నాయన గారినీ, అమ్మ గారినీ సైతం ఎంతో ఆదరంగా గౌరవించి సేవలు చేసేది స్వంత కోడలిలా. మా అమ్మగారు వారి నాయన గారి వద్ద ఆయుర్వేదం వైద్యం బాగ నేర్చుకుని చుట్టు పక్కల గ్రామాల్లో అందర్కి వైద్య సేవలు అందించే వారు.అమ్మ గారి వద్ద సహన వైద్యం సైతం నేర్చుకుని మా అమ్మ గారికి వైద్య సేవల్లో సాయం గానూ ఉండేది.

కొత్త మోజులో కొంతకాలం నాకేమీ తెలిలేదు కాని ఆ తర్వాత క్రమేపీ సుందరి మనస్సూ, ఆమె ప్రవర్తనా అర్థం కాజొచ్చింది, నేను తెలికుండానే పెద్ద ఊబిలో పడ్డానని తెల్సే సరికే నడుం లోతుకు కూరుకు పోయాననని, ఇక మునిగి పోడం తప్ప బయట పడ లేనని అర్థమైంది. నా పెళ్ళి సుందరితో జరగ్గానే నా జీవితంలో సుందరం నశించగా, నా పేరు లోని సుందర్ ను కూడా నేను తుడిచేసుకున్నాను. నా వివాహం తర్వాత నా పేరు కేవలం ఏ.ఆర్. అయ్యర్ గా మారి పోయింది.

ఒక్క మారైనా మా యింట అడుగు పెట్టిన పాపాన పోలేదు నా భార్య. పెళ్ళైన మూడు నిద్దర్లతోనే ఆమె అత్తింటి కాపురం ముగిసింది. అత్త మామలకు ఒక్క రోజు సేవలు చేయటం మాట అటుంచి, వారిని "అత్తయ్య గారూ, మామయ్యగారూ ! అని పిలిచింది కూడా లేదు నాభార్య. ఎప్పుడు ఊరెళ్ళి అందర్నీ చూసి వద్దామని పిలిచినా' అది పల్లె టూరు అంటుంది, తాను పెద్ద సిటీలో పుట్టి పెరిగినట్లు. అక్కడ చాలా మంది జనం, నాకు ఎవ్వరితోఎలా మాట్లాడాలో తెలిదు, నేనెప్పుడూ అంతమందిలో ఉండలేదు, నాకు భయం' అంటుంది..ఆ తర్వాత చూలింత, బాలింత, ప్రయాణం చేయను పసి బిడ్డలు, నా ఆరోగ్యం బావులేదు,' ఇలా ఎప్పుడు రమ్మన్నా ఏదో ఒక సాకు చెప్తుండేది. నాకు విసుగై పోయి పిలవడం మానేశాను, తీరినపుడు ఎప్పుడైనా నేను వెళ్ళినా వచ్చాక ఒకే గోల. నేను తనకే స్వంతమని బావించి ఎవ్వర్నీ నా దరి దాపులకు రాకుండా చేసింది. దానికి సుందరి తల్లి మా అత్తగారు వత్తాసు పలగ్గా, తండ్రి మాట చెవిని పెట్టక నన్ను నా తల్లి దండ్రులకు ద్రోహిగా సమాజం ముందు నిలిపింది. ఇతరులు నాతో మాట్లాడితే నేను తనకు దూరమవుతానని భ్రమ పడింది. పైగా ఒక్కర్తే కుమార్తె కావటాన అతి గారాబం వల్ల ఇతరులను అర్థం చేసుకోడం, ఇతరుల మనస్సు తెల్సుకోడం అస్సలు తెలివు ఆమెకు. ఎంత కాలమైనా అన్నిట్లో ఇతరులే తాను చెప్పినట్లు వినాలనే మూర్ఖపు పట్టుదల అధికం. నా వారితో చేరితే రాక పోకలు సాగిస్తే వారికి నా జీతమంతా ఇచ్చే స్తానని, అమ్మా నాయన గార్లను నా వద్దకు తెచ్చుకుంటానని, వారికి ఆమె సేవలు చేయ వలసి వస్తుందని ఆమె భీతి. నలుగురు ఆడ బిడ్డలు రాక పోకలు సాగిస్తే తన ఇల్లు గుల్లవుతుందని, వారి కంతా వండి వార్చ వలసి వస్తుందని ఆమె భయం. వారంతా తన ఇంట తిష్ట వేస్తారనీ వాళ్ళ పిల్లల చదువులూ అన్నీ తనపై పడతాయనీ భీతి. ఇవన్నీ మనస్సులో ఉంచుకుని నన్ను నా విధుల నుండీ దూరం చేసింది, ఒక్కగానొక్క కొడుకునైన నన్ను మా అమ్మా నాయన గార్లకు తల కొరివి పెట్టే కనీస ధర్మం కూడా దక్క కుండా చేసింది. అంత మందిలో పుట్టిన నన్ను ఏకాకిని చేసింది. మనస్సులో మాట చెప్పుకునే వారు లేక అందరూ గుర్తు వచ్చి మగవాడి నైనా రాత్రులు ఒక్కో సారి ఏడుస్తూ గడిపాను. ఇతరులెవరైనా ఆమెను క్షమించరు. మా అమ్మ నా నుండీ వివాహ సమయంలో తీసుకున్న మాటైనా కనీసం దక్కించాలని నేను ఆమె ఆడించినట్లల్లా ఆడాను. అది నా బలహీనతగా గుర్తించి నన్ను తన కొంగున కట్టు కుని, గుప్పిట్లో బంధించింది. మా అమ్మగారు నా భార్య మనస్తత్వాన్ని వివాహ సమయం లోనే గుర్తించారు.

" నాయనా సుందరం! నీవు పరాయమ్మ కన్నబిడ్డను స్వీకరిస్తున్నావు , నీ జీవిత బాగస్వామిగా ఆమె ఎంత తప్పు చేసినా ఎట్టి

పరిస్థితుల్లోనూ ఆమెను బాధించకు. ఇది నా ఆజ్ఞ." అనే ఆమె కిచ్చిన మాట కోసం ఈమె నింత కాలం ఎన్ని ఘోరాలు చేసినా ఓర్పు వహిస్తూనే వస్తున్నాను.

నా అప్ప చెల్లుళ్ళూ , బాబాయిలూ అంతా నాకు దూరం కాగా, వృద్ధాప్యంలో వారి బాగోగులు చూసే అవకాశమే నాకు కలక్కుండా చేసింది. ఉద్యోగం వదలి మా స్వంత ఊరికి వెళదామంటే అలా జరిగితే తాను ఉరేసుకుని చచ్చి పోతానని బెదిరించింది. మా అమ్మా నాన్న గారూ నాకు వ్రాసిన ఉత్తరాలన్నీ చింపేసి నాకు అందకుండా చేసింది. మా అమ్మా నాన్న గార్ల మరణం సమాచారాన్ని సైతం దాచేసింది" అంటూ కళ్ళ నీరు కండువాతో వత్తు కుంటున్న నన్ను చూసి బాధ పడ్డారు నా గ్రాండ్ చిల్డ్రన్, శైలేష్ , సుమ.

" తాత గారూ! బాధ పడకండి . ' విధి ఎలా ఉంటే అలాగే జరుగుతుంది ఎవ్వరూ ఏమీ మార్చలేరని' మీ అమ్మా నాయన గారూ చెప్పిన మాట సత్యం కదా తాత గారూ!. కొందరి జీవితాలు వివాహంతో మంచి మలుపు తిరుగుతాయంటారు, మరి కొందరి జీవితాలు అనుకోని విధంగా ఇరుకు దారుల వెంట, ముళ్ళ బాటల వెంట సగిపోతుంటాయిట "అంటున్న సుమని చూస్తూ " ఔను తల్లీ! నీవన్నది నిజం. నాది నీవు చెప్పిన రెండో దారి." అన్నాను బాధగా. "సరే పదండి తాత గారూ! ఈ రోజు మనం అలా షికారుగా వెళ్ళి ఐస్క్రీం తినొద్దాం బామ్మ ఇంటికి వచ్చేలోగా "అంటూ నా చేతులు పట్టుకుని నడిపించారు వారు.




రాజారావు, రమణి దంపతులకు ఇద్దరు కొడుకులు, ఒక కూతురు. ముగ్గురికీ పెళ్లిళ్లైపోయాయి. చక్కగా సెటిలై పోయారు కూడా.

రాజారావు గారు రిటైరయి పోయారు. చేసింది ప్రైవేటు ఉద్యోగం కావడంతో పెన్షన్ లేక పోయినా ముందు చూపుతో ప్రణాళికా బద్ధంగా పొదుపు, మదుపు చేస్తూ వచ్చారు గనక హాయిగా చీకూ చింతా లేని వృద్ధాప్య దశకు చేరుకున్నారు. భార్య ఆయనకు నిజంగా అర్ధాంగి. అనుకూలవతి. వాళ్లిద్దరూ అంత వయసున్నట్టు కనిపించక పోవడం..

పిల్లలు కొంచెం ఘనం గానే షష్టి పూర్తి జరిపి తమ తల్లి దండ్రులు తమను ఎంత బాగా పెంచి, పెద్ద చేసిందీ..ఆహుతులైన చుట్టాలు, సన్నిహితులు, స్నేహితుల మధ్య తలచుకుని వాళ్లకు మనస్ఫూర్తిగా కృతజ్ఞతలు అర్పించుకున్నారు.

ఆ షష్టి పూర్తి అయిన ఆరు నెలలకు రాజా రావు పిల్లల్ని సకుటుంబ సపరివారంగా రమ్మని మెయిల్ చేశాడు.

తండ్రి అంత హఠాత్తుగా తమను ఎందుకు రమ్మన్నారో తెలీక ఆశ్చర్య పోయినా, వచ్చేశారు.

అందరితో నాల్రోజులు ఆహ్లాదంగా గడిపాక, రాజారావు ఓ సాయంత్రం ఇంటి డాబా పైన అందర్నీ సమావేశ పరచి-

"నాకు తెలుసు మీరందరూ 'నేనెందుకు రమ్మన్నానో' అని ఆశ్చర్య పోతున్నారని. మనిషి పుట్టి, పెరిగి, చదువు పూర్తయ్యే వరకు బాధ్యతల బరువు అంతగా తెలియదు..కాని ఉద్యోగం, పెళ్లి, పిల్లలు, వాళ్ల పెంపకం ఇవన్నీ రాను రాను బాధ్యతల బరువును పెంచడమే కాదు, మనిషిని యాంత్రికం చేస్తుంది. అనుభూతుల్లేని మర మనిషిని చేస్తుంది. వృద్ధాప్య దశ మరీ దారుణం. ఒక పక్క వ్యాధులు, మరో పక్క వృద్ధాప్యం, ఇంకో పక్క ఆర్థిక లేమి వల్ల అయిన వాళ్ల నిరాదరణ కుంగ దీస్తుంది. అయితే ఇవన్నీ నేను కుర్ర తనంలోనే విజువలైజ్ చేసుకోవడం వల్ల సరైన ప్రణాళికలతో ఈనాడు ఆర్థికంగా బలంగా ఉన్నాను. సంపూర్ణ ఆరోగ్యంతో ఆనందంగా ఉన్నాను. మళ్లీ జన్మ ఉంటుందో, ఉండదో, ప్రతి మనిషికీ తన జీవితాన్ని సంపూర్ణంగా అనుభవించే హక్కు ఉంది. చాలా మంది తమ పిల్లలకు రెక్కలొచ్చాక కూడా తామే కష్ట పడుతూ, మనవలూ, మనవరాళ్ల పాలన పోషణలో తల మునకలవుతుంటారు. అంటే, మళ్లీ యాంత్రికతకు చేరువవుతారన్న మాట. అందుకే నేనో నిర్ణయం తీసుకున్నాను-" అని కాస్తాగి,

"మిమ్మల్ని మీ మీ జీవితాల్లో సెటిల్ అయ్యేలా చేశాము. మీకు ఇవ్వాల్సినవన్నీ వీలునామాలో రాశాను. ఇహ మేము మీ నుంచి ఐసోలేట్ అవుతాము. భగవంతుడు మాకు ఇచ్చిన జీవితాన్ని ఫల వంతం చేసుకుంటాము. రేపటి నుంచి మా ఇద్దర్కీ కొత్త జీవితం ప్రారంభమవుతుంది. కొంత కాలం తర్వాత మిమ్మల్ని ఇబ్బంది పెట్టకుండా, మా అంతట మేము హోం ఫర్ ది ఏజ్డ్ లో చేరి పోతాం... మీ అందరూ అభినందనల గ్రీన్ సిగ్నలివ్వండి. మాదైన జీవితం మమ్మల్ని గడపనివ్వండి. సరేనా?"అన్నాడు.

అందరి మనసులు కాసేపు బరువెక్కాయి..కాని అంతలోనే చప్పట్లతో అభినందనలు తెలిపారు.

****

రమణీ "కాఫీ..కాఫీ ఏదోయ్"

"తెస్తున్నానుండండి.."అని క్షణాల్లో కాఫీ కప్పుతో భర్త ముందు ప్రత్యక్షమయింది.

"చూడు రమణీ, నిజంగా మనం అనుభవించ బోయేది కొత్త జీవితం. మనం ఎలా కావాలనుకుంటున్నామో అలాంటి జీవితం. అప్పుడు మనం అనుభవించింది ఆదరా బాదరా జీవితం. ఎవరో తరుముకు వస్తున్నట్టు ఉండే దాంట్లో మాధుర్యం ఉండదు. ఇదే అసలైంది. ఏ బాదర బందీ లేనిది."అని కన్ను గీటాడు.

ఆవిడ కాఫీ కప్పు ఆయన చేతికిచ్చింది. ఆయన కొద్దిగా తాగి "అరే, చక్కెరెయ్యడం మర్చి పోయావు"అన్నాడు. ఆవిడ అమాయకంగా "చక్కెర ఎప్పట్లానే వేశానే" అంది.

"నువ్వు చక్కెర ఎప్పట్లానే వేశావు..కాని నేనే ఎప్పట్లా కాకుండా, నిన్ను ముద్దెట్టుకు తాగాను.. అందువల్ల చేదుగా ఉంది. నువ్విప్పుడు ఎంత చక్కెర వేసినా, కాఫీ తియ్యగా ఉండదు..పోనీ ఓ పని చేద్దాం..కాఫీ బదులు ముద్దులతో అధరామృతం తాగేద్దాం ఇద్దరం. ఏవంటావు?"అన్నాడు నవ్వుతూ.

ఆ తర్వాత కంప్యూటర్ ముందు నుంచి మధ్యాహ్న భోజనానికి లేస్తూ-"రమణీ, దిల్లీకి ఫ్లైట్ టికెట్లు బుక్ చేశాను. రేపు రాత్రి పున్నమి వెన్నెల్లో మనిద్దరం తాజ్ సోయగం చూడ బోతున్నాము. ప్రేమికులకు అదో మధురానుభూతిట. సో అది మనం చవి చూడ బోతున్నాం. బట్టలు సర్దుకుందాం పద.."అని తొందర బెట్టాడు.

*****

"చూడు రమణీ..ఆకాశం వెన్నెల గుమ్మరిస్తుంటే తాజ్ అందం చూడు..అసలు అది ముంతాజ్ సమాధి అనుకుంటారా? చూసే చూపు, మనసులోని భావన గొప్ప ప్రణయానుభూతికి లోను చెయ్యడం లేదూ..అసలు ఏవేవో మధురోహలు మనసును చిలికేస్తున్నాయి. కదూ.."అని రమణిని దగ్గరకు తీసుకుని బుగ్గల మీద గట్టిగా ముద్దు పెట్టుకున్నాడు. రమణికి ఆ వయసులో కూడా శరీరం వెచ్చనై..హృదయంలో వలపు ఉప్పొంగుతోంది. ఆ ప్రదేశమే అంత వయసు వెనక్కు మళ్లుతుంది.

ఆ రాత్రి అక్కడి రెస్టారెంట్ లో భోంచేసి, దిల్లీలో ముందే బుక్ చేసుకున్న హోటల్ రూమ్ కు వెళ్లారు. కొత్త జంటలకు హనీమూన్ స్పెషల్ ప్యాకెజ్ అందించే ప్రత్యేక హోటల్ అది.

వాళ్ల రూమ్ కూడా మరీ ఆడంబరంగా కాకపోయినా కమ్మని సువాసనతో ఆహ్లాదానుభూతిని అందజేసేట్టుగా డెకరేట్ చేసి ఉంది. లోపలికి అడుగుపెట్టంగానే ఆ వయసులో కూడా వాళ్ల మనసుల్లో చిలిపి ఊహలు చిందులు వేయసాగాయి. టేబుల్ మీద ఒక

పక్కగా 'కొత్త దంపతులకు స్వాగతం, మీకు మా ఆతిథ్యం నచ్చితే, మీ పిల్లలకు కూడా పెళ్లిలయ్యాక హనీమూన్ కు ఇక్కడికే పంపగలరు..మధురానుభూతిని మంచి డిస్కౌంట్ తో అందిస్తాం. మనోహరమైన రాత్రిని అనుభవించండి'అని ఇగ్లీష్ లో రాసి ఉంది. మేనేజ్ మెంట్ చమత్కారానికి ఇద్దరికీ నవ్వువచ్చింది.

"ఆ వార్డ్ రోబ్ లో నాకు పంచె, నీకు తెల్ల చీర ఉన్నాయి. స్నానం చేసి బట్టలు కట్టుకుంటే, హోటల్ వాళ్లు న్యూలి మ్యారీడ్ కపుల్స్ కు ఫ్రీ ట్రీట్ ఏర్పాటు చేస్తారట! పద..క్విక్" అన్నాడు.

ఇద్దరూ ప్రిపేరై రిసెప్షన్ కు ఇన్ ఫాం చేసిన పావు గంటకు చక్కటి భోజనం తెచ్చి వడ్డించి, తిన్నాక పసందైన పాన్ ఇద్దరి చేతుల్లో పెట్టి ' స్వీట్ డ్రీమ్స్' చెప్పి వెళ్లి పోయారు.

గదిలో డిమ్ లైట్, మంద్రంగా సంగీతం వినిపిస్తోంది. ఆ వయసులోనూ ఇద్దరిలో కోర్కెలు రెక్కలు విరుచుకుంటున్నాయి. ఆ వివసత్వంలో ఎవరు ఎవరిని మొదలు చేరారో కాని, ముద్దులు, కౌగిలింతలు, మధురానుభూతులు అన్నీ ఒక్కటొక్కటిగా సొంతం చేసుకున్నారు.

*****

"ఏవోయ్, రాత్రి అనుభవం ఎలా ఉంది"అడిగాడు రాజారావ్.

"నాకు మరో జన్మలా ఉంది. ఈ జన్మకు మిమ్మల్ని పెళ్లి చేసుకోవడం ఒక అదృష్టమైతే ఇది నిజంగా మరో జన్మ"అందావిడ ఆనంద బాష్పాలు కళ్లలో నిండగా..

"పిచ్చి..ఇదేం చూశావు..మన జవ సత్వాలుడుగిపోయేలోగా మనం స్వర్గపుటంచులు చూస్తాం. ఆ తర్వాత ఆధ్యాత్మిక యాత్రలూ చేద్దాం. జీవితాన్ని పరిపూర్ణంగా అనుభవించిన సంతృప్తితో తనువు చాలిస్తాం. ఇవాళ రాత్రి ఊటీ బయలు దేరుతున్నాం. రేపు రాత్రి అక్కడ హోటల్ గదిలో..మనిద్దరం"

"అబ్బా..సిగ్గేస్తోందండీ"అంటున్న ఆవిడను గట్టిగా పెనవేసుకున్నాడు.

***




నిఖిల్ ఇంట్లో మాయమై   వీధిలో తేలాడు.

నడుం వయ్యారంగా తిప్పుతూ కాళ్ళకు నృత్య భంగిమలు అప్పగించాడు. కుడి చేతిలో వున్న చిన్న చేసంచిని విష్ణు చక్రంలా తిప్పాసాగాడు. తేప, తేపకు తన షర్టు ముందు జేబులోకి తొంగి చూస్తూ అందులో మిసమిసలాడే ఏబది రూపాయల నోటును గుండెలకు హత్తుకుంటున్నాడు. ఇది సాధారణ విషయమే అయినప్పటికీ ఈరోజు తాను   కొత్త ప్రయోగం చేయబోతున్నాడు. అందుకే అతనిలో అంత ఉత్సాహం..

నాలుగు చక్రాల బండిపై జామకాయలు కనబడగానే నిఖిల్ కాళ్ళకు బ్రేకులు పడ్డాయి.. వెదక పోయిన తీగ   కాళ్ళకు తగిలినట్లు..

“కిలో ఎంత?..” అడిగాడు బండి ఆసామిని.

“అరవై    రూపాయలు” అన్నాడు.

“నలభైకిస్తావా..?”

“లేదు బాబు.. నాకు గిట్టుబాటు కాదు.. చివరికి ఎభైకిస్తా..”

నిఖిల్ అలోచనలో పడ్డాడు తన ప్రయోగం గుర్తుకు వచ్చింది. కిలో నలభై అయితే బాగుండును..

మరో చోట కనుక్కుందామని గెంతులు వేస్తూ బయలుదేరాడు.

మరో బండి అబ్బాయి జామకాయలు నలభైకిస్తానన్నాడు.

నిఖిల్ మళ్ళీ ఆలోచనలో పడ్డాడు. మరోచోట అడిగితే యింకా తగ్గ వచ్చు అనుకుంటుంటే.. ఒక రైతు రోడ్డుపై కూర్చొని జామకాయలు అమ్ముతూవుండటం నిఖిల్ కంట పడింది.

రైతు వద్దకు వెళ్ళాడు.

“తా.. తా.. జామకాయలు కిలో ఎంత..”

‘ముప్పై రూపాయలు బాబూ..”

నిఖిల్ మనసులో నవ్వుకోసాగాడు. తాను అనుకున్నట్లే జరుగుతోంది.. తన ప్రయోగం ఫలిస్తోంది.

పట్టుమని పదేండ్లు లేని నిఖిల్ అలా అశల పందిరిలా  బేరాలాడుతూ రావటం  గమనించిన రైతుకు ముచ్చటేసింది.

"బాబూ  మాతోట్లోకి వెళ్ళావంటే మానాన్న జానయ్య నీవన్న రేటుకిస్తాడు" అన్నాడు. నిఖిల్ ఉత్సాహం రెట్టింపయ్యింది. ఈ రోజు తన అదృష్టం పండింది అనుకున్నాడు.

ఒకే వస్తువు నాలుగు చోట్ల తిరిగితే నాలుగు రకాల ధరలు.. తాతయ్య తన తోటలోకి రమ్మంటున్నాడు. వెళ్తే ఎంచక్కా యింకా తక్కువధరకే కొనుక్కోవచ్చు. అని మనసులో ఉవ్విళ్ళూరగానే

"సరే తాతయ్యా.." అంటూ ఎగిరి గంతు వేసాడు.

లోటకు దారి తెలుసుకున్నాడు.. అక్కడికి అది మరో కిలోమీటరు దూరం. హుషారుగా చేసంచి గాలిలో ఊపుకుంటూ పరుగు తీసాడు నిఖిల్.

తోట లోకి అడుగు పెట్టగానే ఆశ్చర్య పోయాడు. తోట లోని జామ చెట్లను.. వాటికి విరగ కాసిన జామ కాయలను చూసి నిఖిల్ తబ్బిబ్బయ్యాడు.

"జానయ్య తాతా.. ఈ చెట్లన్నీ నీవేనా.. " అంటూ ఆశ్చర్యంగా అడిగాడు అక్కడున్న పండు ముదుసలిని  చూస్తూ ..

"అవును మనుమడా.. నా కొడుకు ఫోన్ చేసి చెప్పాడు నువ్వు వస్తున్నావని..  చెట్టెక్కి నీకు కావాల్సిన జామ పండ్లన్నీ కోసుకో.." అన్నాడు జానయ్య.

"ఎన్ని డబ్బులివ్వాలి.. నావద్ద ఎక్కువ లేవు.." అన్నాడు నిఖిల్ బుంగ మూతి బెడ్తూ..

"డబ్బులు ఏమీ వద్దు.. నన్ను తాతా అని ప్రేమతో పిలిచావు... అది చాలు" అంటుంటే జానయ్య కళ్ళు చెమ్మగిల్లాయి తన మనుమని అకాల మరణం జ్ఞప్తికి వచ్చి.

నిఖిల్ ఆనందం హద్దులు దాటింది.. తనను తాను మర్చిపోయాడు. అమితోత్సాహంతో చెట్టెక్కాడు. కాయలు కోసుకుంటూ తన చేసంచిని నింపకో సాగాడు. పెద్ద సంచిని తేస్తే బాగుండేదని విచారించాడు. బుర్ర వేగంగా పనిచేస్తోంది.. వెంటనే తన షర్టు విప్పి అందులో జామపండ్లు నింప సాగాడు. ఒక చేత్తో సంచి.. షర్టు.. మరోచేత్తో పండ్లు కోస్తూ నోటికి సైతం పని అప్పగించడంతో పట్టు తప్పింది.. దభాల్న కింద పడిపోయాడు.

"తాతా .." అంటూ గావు కేక పెట్టాడు. నిఖిల్ నోట్లో నలిగిన సగం జామ పండు బయట పడింది.

***

కాలు విరిగి హాస్పిటల్ లో అడ్మిట్ అయ్యాడు నిఖిల్..

ఇదంతా.. నా నిర్వాకమే.." అన్నాడు నిరంజన్ రావు. నిఖిల్ తల్లి ఆశ్చర్య పోయింది కడ కొంగుతో కన్నీళ్ళు తుడ్చుకుంటూ..

" ఒక రోజు నేను నిఖిల్ ను తీసుకుని ఫ్రూట్ మార్కెట్ కు వెళ్లాను. ఒకే రకమైన పండ్లు ఒక్కోచోట ఒక్కో ధర వుండటం.. తక్కువ వున్న చోట కొనుక్కోవాలని సలహా యిచ్చానే గాని వాటి నాణ్యత గురించి నేను వివరించ లేదు. వాడు ఈ రోజు చేసిన ప్రయోగం ఇదే. వాడు బజారుకు వెళ్తూ తక్కువ ధరలో జామ పండ్లు కొనుక్కొని మిగిలిన డబ్బులతో చాక్లెట్ కొనుక్కుంటా నాన్నా అన్నాడు నాతో. తీరా జామ తోటను చూసే సరికి వానిలో అత్యాశ కల్గింది. మనిషికి ఆశ సహజమే కాని అత్యాశ వుండకూడదు.. అత్యాశ అనర్థానికి మూలం." అంటుంటే నిఖిల్ కన్నీరు యిక ముందు అత్యాశకు వెళ్ళమని చెబుతున్నాయి.